TGTEL/26/A4846

# నవ సంఘర్షణ

తెలుగు దినపత్రిక

www.navasangharshana.com

CEO &Chief Editor: Medi Naresh

హైదరాబాద్ సంపుటి: 01. సంచిక: 56 గురువారం 1-10-2026 చీఫ్ ఎడిటర్: మేడి నరేష్ పేజీలు-8 వేల:2.00/-

## గ్రేటర్ 34.2డిగ్రీలు



**సిటీబ్యూరో, సెప్టెంబర్ 30**
గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిని దాటి నమోదవుతున్నాయి. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 34.2డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 22.6డిగ్రీలు, గాలిలో తేమ 57శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

# గిల్ డబుల్ ధమాకా..

- విండీస్‌పై టీమిండియా ఘన విజయం!
- 406 పరుగుల భారీ లక్ష్యం ఛేదించిన భారత్
- 223 పరుగులతో గిల్ అజేయ విధ్వంసం
- శతకంతో చెలరేగిన రోహిత్ శర్మ
- తొలి వికెట్‌కు 255 పరుగుల భాగస్వామ్యం
- 117 బంతుల్లోనే గిల్ డబుల్ సెంచరీ
- వన్డేల్లో రెండో ద్విశతకం సాధించిన గిల్
- కోహ్లీతో కలిసి ఇన్నింగ్స్ నిర్మించిన కెప్టెన్
- రుతురాజ్ 31 పరుగులతో నాటౌట్
- 8 వికెట్ల తేడాతో భారత్ విజయం.. సిరీస్ కైవసం

02

గువాహటిలో శుభ్‌మన్ గిల్(223 నాటౌట్) రికార్డు ద్విశతకంతో చెలరేగడంతో వెస్టిండీస్‌పై భారత్ ఘన విజయం సాధించింది. 406 పరుగుల భారీ లక్ష్యాన్ని కేవలం రెండు వికెట్లు కోల్పోయి ఛేదించిన టీమిండియా.. మూడు వన్డేల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో కైవసం చేసుకుంది. ఓపెనర్ రోహిత్ శర్మ(101) శతకంతో అదరగొట్టగా.. గిల్ వన్డేల్లో తన రెండో డబుల్ సెంచరీతో చరిత్ర సృష్టించాడు. 117 బంతుల్లోనే ద్విశతకం పూర్తి చేసిన గిల్.. ఈ ఫార్మాట్‌లో అత్యంత వేగంగా 200 పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా నిలిచాడు. రోహిత్‌తో కలిసి తొలి వికెట్‌కు 255 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పిన గిల్.. అనంతరం విరాట్ కోహ్లీ(29)తో ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. కోహ్లీ ఔటైన తర్వాత రుతురాజ్ గైక్వాడ్(31 నాటౌట్)తో కలిసి జట్టును విజయతీరాలకు చేర్చాడు.అంతకుముందు వెస్టిండీస్ బ్యాటర్లు చెలరేగడంతో ఆ జట్టు 50 ఓవర్లలో 405 పరుగులు చేసింది. జాన్ క్యాంప్‌బెల్(101), షాయ్ హోప్(104), అమిర్ జంగూ(114) శతకాలతో కదం తొక్కారు. భారత బౌలర్లను ధీటుగా ఎదుర్కొన్న విండీస్ బ్యాటర్లు భారీ స్కోరు నమోదు చేశారు. అయితే గిల్ ద్విశతకం, రోహిత్ శతకంతో భారత్ ఆ లక్ష్యాన్ని అలవోకగా ఛేదించి సిరీస్‌ను సొంతం చేసుకుంది.






02

## రష్యా సైన్యంలో చేరొద్దు.. తీవ్ర ప్రమాదం:

- భారతీయులకు కేంద్ర విదేశాంగ శాఖ హెచ్చరిక
- ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రాణాలను పణంగా పెట్టొద్దని సూచన
- రష్యా సైన్యంలో చేరుతున్న భారతీయులపై ఆందోళన
- అధిక వేతనాల ఆశతో వెళ్లొద్దని హితవు
- అనధికారిక ఏజెంట్ల రిక్రూట్‌మెంట్లపై అప్రమత్తంగా ఉండాలని సూచన
- రష్యా పాస్‌పోర్ట్ తీసుకుని సైన్యంలో చేరుతున్న ఘటనలు
- 139 మంది భారతీయులను స్వదేశానికి తీసుకొచ్చిన ప్రభుత్వం
- మరో రెండు డజన్ల మందిని రప్పించేందుకు ప్రయత్నాలు



## జగన్, మమత, పవార్ కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలి

- కాంగ్రెస్‌ను వీడిన వారంతా వెనక్కి రావాలి
- రేవంత్‌తో తనకు ఎలాంటి విభేదాలు లేవు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యలు

హైదరాబాద్,
వైసీపీ అధినేత జగన్ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి చేరే అవకాశాలున్నాయంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపుతున్నాయి. జగన్, మమతా బెనర్జీ, శరద్ పవార్ వంటి కాంగ్రెస్ పార్టీ మాజీ నేతలు తిరిగి సొంత గూటికి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వారంతా పార్టీలోకి వస్తే అందరికంటే తానే ఎక్కువ సంతోషిస్తానని అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డితో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్న భట్టి... జగన్‌తో నేరుగా పనిచేయకపోయినా, పాత నేతలంతా తిరిగి వస్తే దేశాన్ని, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేసినవారవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నేతలను కులం కోణంలో చూడకూడదని, తామిద్దరం ఐక్యంగా, సమష్టి నిర్ణయాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నామని వివరించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై భట్టి తీవ్ర -మిగతా 2లో

## గజ్వేల్ గడీ కూల్చినట్లే సిరిసిల్ల గడీని

# కూల్చేస్తాం

**సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం**

- జెండా ఎగురవేసిన మొనగాడికి మంత్రి పదవి
- భవిష్యత్తులో మంత్రివర్గంలోకి తీసుకుంటా..
- గత ప్రభుత్వం సిరిసిల్లను ఉరిసిల్లగా మార్చారు
- సిరిసిల్ల ప్రజల గురించి ఏనాడైనా ఆలోచించిందా
- తెలంగాణ ఉద్యమం, ప్రజల ఓట్లతో రాజకీయ లబ్ది
- కల్వకుంట్ల కుటుంబం ఆస్తులు కూడబెట్టుకున్నారు
- సిరిసిల్ల ప్రజాపాలన బహిరంగ సభలో సిఎం రేవంత్
- కేసీఆర్ కుటుంబంపై తీవ్ర స్థాయిలో విమర్శలు
- రాష్ట్ర ప్రయోజనాల కోసం ఢిల్లీకి ఎన్నిసార్లైనా వెళ్తా..
- కరీంనగర్ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- కలెక్టరేట్ నూతన భవన సముదాయం ప్రారంభం
- తెలంగాణ తల్లి విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరణ
- అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ శ్రీకారం

సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సిరిసిల్ల ప్రజల సమస్యలు పరిష్కారం కాలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. గత రెండేళ్లలోనే సిరిసిల్ల అభివృద్ధికి రూ.1,500 కోట్లు కేటాయించామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. సిరిసిల్ల పర్యటనలో భాగంగా నూతన కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించిన సీఎం.. అధికారులతో సమీక్ష నిర్వహించి జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. కాంగ్రెస్ కోసం పనిచేసే సాధారణ కార్యకర్తలకు కూడా పార్టీలో సముచిత గుర్తింపు, అవకాశాలు లభిస్తాయని రేవంత్‌రెడ్డి అన్నారు.

02





02

## పంజాబ్‌లో బీజేపీ వస్తే డ్రగ్స్ నిర్మూలిస్తాం

- నషా ముక్త్ పంజాబ్’ యాత్రలో అమిత్ షా
- అధికారంలోకి వస్తే డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామన్న హామీ
- 2029 డిసెంబర్ 31లోపు లక్ష్యం చేరుకుంటామని ప్రకటన
- ఆప్ ప్రభుత్వంపై అమిత్ షా విమర్శలు
- డ్రగ్స్ విక్రయాలను ఆప్ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఆరోపణ
- రైతులు, పరిశ్రమలు, శాంతిభద్రతల సమస్యలపై ప్రస్తావన
- 2014 తర్వాత డ్రగ్స్ స్వాధీనం పెరిగిందన్న అమిత్ షా
- దేశంలో డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యమని వెల్లడి



- భారత్‌లో ముస్లింలంతా మతం మారినవారేనన్న రాందేవ్
- రామకృష్ణులను పూర్వీకులుగా గుర్తించాలంటూ వ్యాఖ్య
- మూలాలతో అనుసంధానం కావాలని సూచన
- హిందూ-ముస్లింల ఐక్యతతో దేశం బలపడుతుందని వెల్లడి
- ముస్లింలను ఓటు బ్యాంకుగా చూస్తున్నారన్న ఒవైసీ వ్యాఖ్యలపై స్పందన
- రాముడు, కృష్ణుడు, శివుడు, హనుమంతుడు ఒక్కటేనన్న రాందేవ్
- మతం పేరుతో విభేదాలు సృష్టించొద్దని సూచన
- రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపైనా స్పందించిన యోగాగురు
- సనాతన ధర్మంలో విభేదాలకు తావులేదని వ్యాఖ్య

02

## భారత ముస్లింల పూర్వీకులు రాముడు, కృష్ణుడే

భారతీయ ముస్లింలంతా శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, ప్రాచీన రుషులను తమ పూర్వీకులుగా గుర్తించాలని యోగాగురు బాబా రాందేవ్ అన్నారు. మతం మారినప్పటికీ పూర్వీకుల మూలాలు మారవని ఆయన వ్యాఖ్యానించారు. తమ మూలాలతో అనుసంధానమైతే ముస్లింలు బలహీనంగా భావించాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు. హిందూ--ముస్లింలు ఐక్యంగా ఉంటేనే దేశం మరింత బలపడుతుందని రాందేవ్ అన్నారు.

## లష్కరే టాప్ కమాండర్ హతం



02

## బీఆర్ఎస్-బీజేపీ మధ్య పొత్తు

# ఉండబోదు

**మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారు**



- వచ్చే ఎన్నికల్లో సిఎం అభ్యర్థిని నేను కాదు
- కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారు
- కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి
- రాష్ట్ర రాజకీయాలపై కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్,
వచ్చే అసెంబ్లీ ఎన్నికలపై తెలంగాణ రాజకీయాల్లో ఇప్పటి నుంచే చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఆసక్తికరంగా మారాయి. తాను ముఖ్యమంత్రి అభ్యర్థిని కాదని.. మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే తన తండ్రి, పార్టీ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని కేటీఆర్ స్పష్టం చేశారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో ఆయన తెలంగాణ రాజకీయాలు, బీఆర్ఎస్ భవిష్యత్తు, బీజేపీతో పొత్తు, డీలిమిటేషన్, ఓటర్ల జాబితా సవరణ వంటి అంశాలపై మాట్లాడారు. తాను ప్రధాన రాజకీయ పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నందున వచ్చే ఎన్నికల్లో సీఎం అభ్యర్థి మీరేనా అని అడిగిన ప్రశ్నకు కేటీఆర్ స్పష్టంగా సమాధానం ఇచ్చారు. -మిగతా 2లో



02

## బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలు నిర్వహించాలి..

- ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ విధానం తీసుకురావాలని ఇండియా కూటమి డిమాండ్
- సుప్రీంకోర్టును ఆశ్రయించనున్న ఇండియా బ్లాక్
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్
- ఎస్ఐఆర్ ప్రక్రియపై అవకతవకల ఆరోపణలు
- రాష్ట్రపతిని కలవాలని కూటమి నిర్ణయం
- అక్టోబర్ 2 నుంచి 8 వరకు ‘సేవ్ డెమోక్రసీ’ ఆందోళనలు
- అక్టోబర్ 6న ఈసీ కార్యాలయాల వద్ద నిరసన
- నవంబర్ 1న ఢిల్లీలో భారీ ర్యాలీ
- సీఈసీ రాజీనామా చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని వెల్లడి



## నేడు తెలంగాణ కేబినెట్ సమావేశం

- సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన భేటీ
- కీలక నిర్ణయాలు తీసుకునే ఛాన్స్
- పలు అంశాలపై చర్చ జరిగే అవకాశం
- కేబినెట్ విస్తరణ మరింత ఆలస్యం!?

హైదరాబాద్,
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నేడు జరగనుంది. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని 6వ అంతస్తులో ఈ కేబినెట్ భేటీ నిర్వహించనున్నారు. ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న 37వ మంత్రివర్గ సమావేశం కావడం విశేషం. ఈ అత్యున్నత స్థాయి సమావేశంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు ముఖ్యాంశాలపై సుదీర్ఘంగా చర్చించనున్నట్లు తెలుస్తోంది. -మిగతా 2లో

# గిల్ డబుల్ ధమాకా..

**-విండీస్‌పై టీమిండియా ఘన విజయం!**
**-406 పరుగుల భారీ లక్ష్యం ఛేదించిన భారత్**
**-223 పరుగులతో గిల్ అజేయ విధ్వంసం**
**-శతకంతో చెలరేగిన రోహిత్ శర్మ**
**-తొలి వికెట్‌కు 255 పరుగుల భాగస్వామ్యం**
**-117 బంతుల్లోనే గిల్ డబుల్ సెంచరీ**
**-వన్డేల్లో రెండో ద్విశతకం సాధించిన గిల్**
**-కోహ్లితో కలిసి ఇన్నింగ్స్ నిర్మించిన కెప్టెన్**
**-రుతురాజ్ 31 పరుగులతో నాటౌట్**
**-8 వికెట్ల తేడాతో భారత్ విజయం.. సిరీస్ కైవసం**



గువాహటి

వెస్టిండీస్‌తో రెండో వన్డేలో టీమిండియా రికార్డు స్థాయిలో భారీ లక్ష్యాన్ని ఛేదించింది. 406 పరుగుల విజయలక్ష్యాన్ని 8 వికెట్లు కోల్పోకుండా అందుకుంది. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 223 పరుగులతో అజేయంగా నిలిచి వన్డేల్లో రెండో డబుల్ సెంచరీ నమోదు చేశాడు. ఓపెనర్ రోహిత్ శర్మ 101 పరుగులతో శతకం సాధించడంతో భారత్ ఛేదనకు అదిరే ఆరంభం లభించింది. గిల్, రోహిత్ కలిసి తొలి వికెట్‌కు 255 పరుగులు జోడించి విజయానికి బలమైన పునాది వేశారు. రోహిత్ ఔటైన తర్వాత విరాట్ కోహ్లీతో కలిసి గిల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. కోహ్లీ 29 పరుగులతో నాటౌట్‌గా నిలవగా.. అనంతరం రుతురాజ్ గైక్వాడ్ 31 పరుగులతో గిల్‌కు అండగా నిలిచాడు. విండీస్ బౌలర్లపై విరుచుకుపడ్డ గిల్ బౌండరీలతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. 117 బంతుల్లోనే ద్విశతకం పూర్తి చేసి రికార్డు సృష్టించాడు. చివరి వరకు క్రీజులో నిలిచి భారత్‌కు ఘన విజయాన్ని అందించాడు.

విండీస్ టాపార్డర్ శతకోత్సవం

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ జాన్ క్యాంప్‌బెల్ 101 పరుగులతో శతకం బాదగా.. కెప్టెన్ షాయ్ హోప్ 104, అమిర్ జంగూ 114 పరుగులతో సెంచరీలు సాధించారు. ముగ్గురూ ధాటిగా ఆడటంతో విండీస్ 38 ఓవర్లలోనే 300 పరుగుల మార్క్‌ను దాటింది. చివర్లో రోస్టన్ చేజ్ 29 పరుగులతో మెరుపులు మెరిపించడంతో వెస్టిండీస్ 405 పరుగుల భారీ స్కోరు సాధించింది. అయితే భారత బ్యాటర్లు అదే స్థాయిలో చెలరేగడంతో విండీస్ నిర్దేశించిన లక్ష్యం చిన్నబోయింది.

## భారత ముస్లింల పూర్వీకులు రాముడు, కృష్ణుడే

**-భారత్‌లో ముస్లింలంతా మతం మారినవారేనన్న రాందేవ్**
**-రామకృష్ణులను పూర్వీకులుగా గుర్తించాలంటూ వ్యాఖ్య**
**-మూలాలతో అనుసంధానం కావాలని సూచన**
**-హిందూ-ముస్లింల ఐక్యతతో దేశం బలపడుతుందని వెల్లడి**
**-ముస్లింలను ఓటు బ్యాంకుగా చూస్తున్నారన్న ఒవైసీ వ్యాఖ్యలపై స్పందన**
**-రాముడు, కృష్ణుడు, శివుడు, హనుమంతుడు ఒక్కటేనన్న రాందేవ్**
**-మతం పేరుతో విభేదాలు సృష్టించొద్దని సూచన**
**-రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపైనా స్పందించిన యోగాగురు**
**-సనాతన ధర్మంలో విభేదాలకు తావులేదని వ్యాఖ్య**



మధుర

యోగాగురు బాబా రాందేవ్ ముస్లింల పూర్వీకులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారత ముస్లింలంతా మతం మారినవారేనని, శ్రీరాముడు, శ్రీకృష్ణులను తమ పూర్వీకులుగా గుర్తించాలని అన్నారు. బుధవారం మధురలో ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో ముస్లింలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించకుండా, వారిని కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్నారని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై రాందేవ్ స్పందించారు.ముస్లిం సోదరులు తమ ప్రాచీన మూలాలను, రామకృష్ణులను పూర్వీకులుగా గుర్తించాలని రాందేవ్ అన్నారు. తమ మూలాలతో అనుసంధానమైతే వారు ఎన్నటికీ బలహీనంగా భావించరని పేర్కొన్నారు. హిందూ-ముస్లింలు ఐక్యంగా ఉంటే దేశం మరింత బలపడుతుందని వ్యాఖ్యానించారు.

రేవంత్ వ్యాఖ్యలపైనా స్పందన

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన 'శివుడు పేదల దేవుడు.. రాముడు ధనికుల దేవుడు' వ్యాఖ్యలపైనా రాందేవ్ స్పందించారు. సనాతన ధర్మంలో కులం, వర్గం పేరుతో కొందరు విభేదాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. రాముడు, కృష్ణుడు, శివుడు, హనుమంతుడు అందరూ ఒక్కటేనని పేర్కొంటూ.. దేవుడి పేరుతో గందరగోళం సృష్టించవద్దని సూచించారు.

## రష్యా సైన్యంలో చేరొద్దు.. తీవ్ర ప్రమాదం:



న్యూఢిల్లీ,

రష్యా సైన్యంలో చేరడం అత్యంత ప్రమాదకరమని, భారతీయులు అలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని కేంద్ర ప్రభుత్వం మరోసారి హెచ్చరించింది. ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో తాత్కాలిక ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రాణాలను పణంగా పెట్టొద్దని సూచించింది. ఈ మేరకు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ బుధవారం ప్రకటన విడుదల చేసింది. గత రెండేళ్లుగా హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ కొందరు భారతీయులు రష్యా సైన్యంలో చేరుతున్నట్లు నివేదికలు వస్తున్నాయని విదేశాంగ శాఖ తెలిపింది. అధిక ఆదాయం వస్తుందన్న ఆశతో కొందరు స్వచ్ఛందంగా రష్యా సైన్యంలో చేరి, ఆ తర్వాత సమస్యలు ఎదురైనప్పుడు భారత ప్రభుత్వాన్ని ఆశ్రయిస్తున్నారని పేర్కొంది. ఇలాంటి చర్యలను ప్రభుత్వం ఏమాత్రం ప్రోత్సహించదని స్పష్టం చేసింది.

అక్రమ రిక్రూట్‌మెంట్లపై అప్రమత్తం

కొంతమంది భారతీయులు తాత్కాలిక ఆర్థిక ప్రయోజనాల కోసం భారత పౌరసత్వాన్ని వదులుకుని రష్యా పాస్‌పోర్ట్ పొంది మరీ సైన్యంలో చేరుతున్న ఘటనలు తమ దృష్టికి వచ్చినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. అనధికారిక ఏజెంట్లు, కొన్ని సంస్థలు అక్రమంగా రిక్రూట్‌మెంట్లు చేపడుతున్నట్లు పేర్కొంది. ఇలాంటి ఉద్యోగ ఆఫర్ల పట్ల భారతీయులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

139 మందిని వెనక్కి తీసుకొచ్చాం

రష్యా సైన్యంలో ఉన్న భారతీయుల భద్రతతో పాటు వారిని త్వరగా స్వదేశానికి తీసుకురావడానికి రష్యా ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. ఇప్పటివరకు 139 మంది భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చినట్లు తెలిపింది. మిగిలిన సుమారు రెండు డజన్ల మందిని కూడా రప్పించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని పేర్కొంది.

## బీఆర్ఎస్-బీజేపీ మధ్య పొత్తు ఉండబోదు

(మొదటి తరువాయి)

తాను ముఖ్యమంత్రి అభ్యర్థిని కాదని చెప్పారు. 2 ఏళ్ల తర్వాత కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ స్వల్ప తేడాతో అధికారాన్ని కోల్పోయిందని చెబుతూ.. ప్రస్తుతం ప్రజలు గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, ముఖ్యంగా కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలను ప్రస్తావిస్తూ అనే 3 పదాలను కేటీఆర్ ఉపయోగించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ప్రజలు పునరాలోచన చేస్తున్నారని.. పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నారని.. భవిష్యత్తులో తిరుగుబాటు వస్తుందని ఆయన తన రాజకీయ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ మధ్య పొత్తు ఉంటుందన్న ఊహాగానాలపై కూడా కేటీఆర్ స్పందించారు. రెండు పార్టీల సిద్ధాంతాలు పరస్పరం పూర్తిగా భిన్నంగా ఉన్నాయని.. తాము బీజేపీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. బీఆర్ఎస్ 26 ఏళ్ల చరిత్రలో బీజేపీతో పొత్తు పెట్టుకోలేదని కేటీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరును భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)గా మార్చినప్పటికీ పార్టీ సిద్ధాంతంలో ఎలాంటి మార్పు రాలేదన్నారు. పార్టీ డీఎన్ఏ మారలేదని.. అందువల్ల సిద్ధాంతం కూడా మారలేదని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ భవిష్యత్తుపై విశ్వాసం వ్యక్తం చేసిన కేటీఆర్.. తమ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చే సమయంలో గత పరాజయం కంటే పెద్ద స్థాయిలో పునరాగమనం ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు. పార్లమెంట్ నియోజకవర్గాల డీలిమిటేషన్ అంశంపైనా కేటీఆర్ తన అభిప్రాయాలను వెల్లడించారు. లోక్‌సభ స్థానాలను పెంచడంపై మాత్రమే ఎందుకు దృష్టి పెట్టాలని ప్రశ్నించిన ఆయన.. ప్రజలకు ఎమ్మెల్యేలే తొలి స్థాయి ప్రజాప్రతినిధులుగా ఉంటారని అన్నారు. జనాభా నియంత్రణ చర్యలను అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు భవిష్యత్తులో ప్రాతినిధ్యం విషయంలో అన్యాయం జరగకూడదన్న ఆందోళనను కేటీఆర్ వ్యక్తం చేశారు.

# బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలు నిర్వహించాలి..

ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ విధానం తీసుకురావాలని ఇండియా కూటమి డిమాండ్
సుప్రీంకోర్టును ఆశ్రయించనున్న ఇండియా బ్లాక్
సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్
ఎస్ఐఆర్ ప్రక్రియపై అవకతవకల ఆరోపణలు
రాష్ట్రపతిని కలవాలని కూటమి నిర్ణయం
అక్టోబర్ 2 నుంచి 8 వరకు 'సేవ్ డెమోక్రసీ' ఆందోళనలు
అక్టోబర్ 6న ఈసీ కార్యాలయాల వద్ద నిరసన
నవంబర్ 1న ఢిల్లీలో భారీ ర్యాలీ
సీఈసీ రాజీనామా చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని వెల్లడి

ద

న్యూఢిల్లీ,



దేశంలో ఇకపై బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలు నిర్వహించాలని ఇండియా బ్లాక్ కూటమి నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సుప్రీంకోర్టుకు విన్నవించనున్నట్లు కూటమి నేతలు చెప్పారు. సర్ ప్రక్రియలో అవకతవకలు, సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా సహా పలు అంశాలపై ఇండియా బ్లాక్ కూటమి నేతలు బుధవారం ఢిల్లీలో సమావేశమయ్యారు. ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషనల్ సెంటర్ భవనంలో జరిగిన సమావేశంలో కీలక అంశాలపై చర్చించారు.ఈ సమావేశానికి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, శివసేన ఉద్ధవ్ థాక్రే, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ సహా వివిధ పార్టీలకు చెందిన నేతలు హాజరయ్యారు. దాదాపు మూడు నుంచి నాలుగు గంటలపాటు ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నిర్ణయించిన కీలక విషయాలివి. దేశంలో ఎన్నికల్ని బ్యాలెట్ పద్ధతిలోనే నిర్వహించాలి. ఈ అంశంపై త్వరగా విచారణ జరపాలని ఇండియా కూటమి డిమాండ్ చేస్తోంది. సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలి. సర్‌కు అవకతవకలు వంటి అంశాలపై రాష్ట్రపతిని కలవాలని నిర్ణయించారు. ఈ అంశాలన్నింటిపై అవగాహన కలిగించేలా అక్టోబర్ 2 నుంచి 8 వరకు దేశవ్యాప్తంగా సేవ్ డెమోక్రసీ పేరుతో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు. జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయాల వద్ద అన్ని పార్టీల లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు ఆందోళనల్లో పాల్గొంటారు. అక్టోబర్ 6న ఎన్నికల సంఘం కార్యాలయాల వద్ద ఆందోళన చేస్తారు. నవంబర్ 1న ఢిల్లీలో భారీ ర్యాలీ చేపట్టనున్నారు. అలాగే, దేశవ్యాప్తంగా ప్రతిపక్షాల ఆధ్వర్యంలో అనేక చోట్ల ఇండియా బ్లాక్ కూటమి ఆధ్వర్యంలో భారీ ర్యాలీలు చేపడతారు. దీనికి సంబందించిన డేట్లు, వేదికల వివరాల్ని కూడా త్వరలోనే నిర్ణయిస్తారు. సీఈసీ రాజీనామా చేసే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని ప్రతిపక్షాలు తెలిపాయి.

# పంజాబ్‌లో బీజేపీ వస్తే డ్రగ్స్ నిర్మూలిస్తాం

**-'నషా ముక్త్ పంజాబ్' యాత్రలో అమిత్ షా**
**-అధికారంలోకి వస్తే డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామన్న హామీ**
**-2029 డిసెంబర్ 31లోపు లక్ష్యం చేరుకుంటామని ప్రకటన**
**-ఆప్ ప్రభుత్వంపై అమిత్ షా విమర్శలు**
**-డ్రగ్స్ విక్రయాలను ఆప్ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఆరోపణ**
**-రైతులు, పరిశ్రమలు, శాంతిభద్రతల సమస్యలపై ప్రస్తావన**
**-2014 తర్వాత డ్రగ్స్ స్వాధీనం పెరిగిందన్న అమిత్ షా**
**-దేశంలో డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యమని వెల్లడి**



జలంధర్:

పంజాబ్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దుతామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీ ఇచ్చారు. బీజేపీ చేపట్టిన 'నషా ముక్త్ పంజాబ్ యాత్ర'లో భాగంగా జలంధర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2027లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు మద్దతు ఇస్తే.. 2029 డిసెంబర్ 31లోపు పంజాబ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మారుస్తామని చెప్పారు. బీజేపీ నిర్వహించిన ఈ యాత్ర సెప్టెంబర్ 18న ప్రారంభమై దాదాపు 4,000 కిలోమీటర్లు, 117 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా సాగింది.

ఆప్ ప్రభుత్వంపై విమర్శలు

పంజాబ్‌లో డ్రగ్స్ విక్రయాలను ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం అనుమతిస్తోందని అమిత్ షా ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు, పరిశ్రమలు, వ్యవసాయం, శాంతిభద్రతలు, మహిళల రక్షణ వంటి పలు సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. కాశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని, దేశంలో నక్సలిజాన్ని ఎదుర్కొన్నట్లుగానే పంజాబ్‌లో డ్రగ్స్ సమస్యను కూడా నిర్మూలిస్తామని అన్నారు.

డ్రగ్స్ స్వాధీనంపై గణాంకాలు

2004-2014 మధ్య దేశంలో 26 లక్షల కిలోల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకోగా, 2014-2024 మధ్య 1.2 కోట్ల కిలోలకు పైగా స్వాధీనం చేసుకున్నట్లు అమిత్ షా తెలిపారు. ఈ రెండు కాలాల్లో స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ విలువ వరుసగా సుమారు రూ.40 వేల కోట్లు, రూ.1.5 లక్షల కోట్లుగా కేంద్ర ప్రభుత్వం గతంలో వెల్లడించింది. 2026లో కేంద్ర హోంశాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం 2004-2014తో పోలిస్తే 2014-2026 మధ్య స్వాధీనం మరింత పెరిగింది.

# గజ్వేల్ గడీ కూల్చినట్లే సిరిసిల్ల గడీని కూల్చేస్తాం

సిరిసిల్ల,

గజ్వేల్ గడీ కూల్చినట్లే ఈసారి సిరిసిల్ల గడీని నేలమట్టం చేద్దామని కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కేసీఆర్ కుటుంబంపై సీఎం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గరుడ పక్షి దెబ్బ కాకి పిల్లకు ఏం తెలుసని ఎద్దేవా చేశారు. అమెరికా హోటళ్లలో ప్లేట్లు కడిగిన వ్యక్తికి తన విలువ ఎలా తెలుస్తుందని ఘాటుగా స్పందించారు. ఫామ్‌హౌస్‌లలో నిద్రపోయిన వారికి తన గురించి బాగా తెలుసని వ్యాఖ్యానించారు. సిరిసిల్ల నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు. గత రెండున్నరేళ్ల పాలనలోనే సిరిసిల్ల అభివృద్ధికి రూ.1,500 కోట్లు కేటాయించామని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేసిన నాయకుడిని మంత్రివర్గంలోకి తీసుకుంటానని ముఖ్యమంత్రి సంచలన ప్రకటన చేశారు. గత పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు ఏమీ చేయకుండా టీవీ ఛానళ్లు, పత్రికలు, ఫామ్‌హౌస్‌లు, స్టార్ హోటళ్లు మాత్రమే సంపాదించుకున్నారని రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. కరీంనగర్ కలెక్టరేట్ భవనాన్ని ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. టెండర్లు వేసి కేవలం కమీషన్లు దండుకోవడానికే ప్రాధాన్యత ఇచ్చారని మండిపడ్డారు. చివరకు ఆడబిడ్డలకు ఇచ్చే బతుకమ్మ చీరల్లోనూ కమీషన్లు కొట్టి తిన్నారని తీవ్ర పదజాలంతో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహిళలకు 'పుట్టింటి సారె' ద్వారా నాణ్యమైన చీరలను అందిస్తూ సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నామని పేర్కొన్నారు.శాసనసభ స్పీకర్‌గా ఉన్న దళిత బిడ్డ గడ్డం ప్రసాద్‌ను 'అధ్యక్షా' అని పిలవాల్సి వస్తుందనే అహంకారంతోనే కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ ముందు దళితులు డప్పు కొడితే ఆ స్థలాన్ని పసుపు నీళ్లతో కడిగించారని, ఇది తీవ్రమైన అవమానమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను బహిష్కరించే వరకు సమాజం వదలదని హెచ్చరించారు. ఎర్రవెల్లి భూ ఆక్రమణలతో పాటు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌రావ్ అక్రమ ఆస్తుల లెక్కలు తేలుస్తామని, డెక్కన్ స్టార్ హోటల్స్ తదితర ఆస్తుల వివరాలను అసెంబ్లీలో సమయం చాలక దాచామని, త్వరలోనే పార్ట్-2 పేరుతో ప్రజల ముందు పెడతామని సీఎం స్పష్టం చేశారు. సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసే నాయకుడిని కేబినెట్ బెర్త్ కన్ఫార్మ్ అంటూ ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో సిరిసిల్లలో కాంగ్రెస్ జెండా ఎగరేయాలని కాంగ్రెస్ కార్యకర్తలకు సీఎం పిలుపునిచ్చారు. సిరిసిల్ల గడీల మీద గురిపెడదాం..



ఫిరంగులమై పేలుదాం అంటూ కార్యకర్తల్లో జోష్ నింపేలా వ్యాఖ్యలు చేశారు. గతంలో గజ్వేల్ గడీ విషయంలో తాము చెప్పినది చేసి చూపించామని.. ఇప్పుడు సిరిసిల్లపై దృష్టి పెట్టామని రేవంత్ రెడ్డి అన్నారు. సిరిసిల్లలో కాంగ్రెస్ జెండా ఎగురవేసే నాయకుడికి మంత్రి పదవి ఇస్తానని రేవంత్‌రెడ్డి ప్రకటించడం ఆసక్తికరంగా మారింది. బీఆర్ఎస్‌లో కుటుంబ సభ్యులకు కీలక పదవులు దక్కాయని.. కాంగ్రెస్‌లో మాత్రం పార్టీ కోసం పనిచేసిన సాధారణ కార్యకర్తలు, నాయకులకు కూడా అవకాశాలు లభిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. గత 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో సిరిసిల్ల సమస్యలకు నిలయంగా మారిందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ముఖ్యంగా చేనేత, నేత కార్మికుల సమస్యలను ప్రస్తావిస్తూ గత ప్రభుత్వం వారి ఇబ్బందులను పరిష్కరించలేకపోయిందని విమర్శించారు. నేత కార్మికుల ఆత్మహత్యలు, ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వలసలు వంటి అంశాలపై ఆయన ప్రశ్నలు సంధించారు. కేసీఆర్ కుటుంబం సిరిసిల్ల ప్రజల గురించి ఏనాడైనా ఆలోచించిందా అని ప్రశ్నించిన సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణ ఉద్యమం, ప్రజల ఓట్లను రాజకీయంగా ఉపయోగించుకుని ఆస్తులు కూడబెట్టుకున్నారని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబానికి చెందిన ఆస్తులపై కూడా ఆయన పలు విమర్శలు చేశారు. సిరిసిల్ల ఎమ్మెల్యేగా కేటీఆర్ 2009 నుంచి వరుసగా ఎన్నికవుతున్న విషయాన్ని ప్రస్తావించిన రేవంత్‌రెడ్డి.. ఇంతకాలం ప్రాతినిధ్యం వహించినప్పటికీ నియోజకవర్గంలోని నేత కార్మికుల సమస్యలు ఎందుకు పూర్తిగా పరిష్కారం కాలేదని ప్రశ్నించారు. కేటీఆర్ అమెరికా నుంచి వచ్చి సిరిసిల్ల ఎమ్మెల్యే టికెట్ పొందారని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కేటీఆర్‌పై విమర్శలు చేస్తూ వ్యక్తిగత వ్యాఖ్యలు కూడా చేశారు. ఫామ్‌హౌస్‌లు, ఫారిన్ లైఫ్ వంటి అంశాలను ప్రస్తావిస్తూ బీఆర్ఎస్ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలోనూ అవినీతి జరిగిందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కరీంనగర్ కలెక్టరేట్ నిర్మాణం ఎందుకు పూర్తికాలేదని కేటీఆర్‌ను ప్రశ్నించారు. టెండర్లు, కమీషన్ల విషయంలో గత ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పుట్టింటి సారె పేరుతో ఆడబిడ్డలకు నాణ్యమైన చీరలు అందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని వివరించారు. సిరిసిల్ల చేనేత, నేత కార్మికుల సమస్యలను ప్రస్తావిస్తూ బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో రూ.2,234 కోట్లు ఖర్చు చేస్తే.. తమ ప్రభుత్వం రెండున్నరేళ్ల కాలంలో రూ.1,731 కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. సిరిసిల్ల జిల్లాకు కూడా తమ ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించిందని పేర్కొన్నారు.ఇదే.. సిరిసిల్ల సభలో ఎమ్మెల్సీ ఎన్నికలను కూడా రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ఎమ్మెల్సీగా మండలికి పంపాలని ఆయన కోరారు. సిరిసిల్ల నుంచి కాంగ్రెస్‌కు బలమైన నాయకత్వాన్ని తయారు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కలిసి పనిచేస్తారని ఆయన పేర్కొన్నారు. సిరిసిల్ల పర్యటనలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు బీఆర్ఎస్‌పై రాజకీయంగా కూడా సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో కాంగ్రెస్ బలపడటమే లక్ష్యంగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం తాను ఎన్నిసార్లైనా ఢిల్లీ వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రానికి నిధులు, అభివృద్ధి కోసం కేంద్ర మంత్రులను కలవాల్సి ఉంటున్నారు. రాష్ట్రంలోని దాదాపు పదిన్నర లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, 4 కోట్ల ప్రజలకు సేవలు అందిస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య బలమైన వారధులుగా ప్రభుత్వ ఉద్యోగులు నిలుస్తున్నారని కొనియాడారు. జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం నాడు ఆయన నూతనంగా నిర్మించిన కరీంనగర్ కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నిజమైన పేదలకు చేరాలంటే ఉద్యోగుల కష్టపడే తత్వమే కీలకమని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టరేట్‌కు సమస్యలతో వచ్చే ప్రజలను సొంత కుటుంబ సభ్యుల్లా భావించి వారికి సాయం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

# నేడు తెలంగాణ కేబినెట్ సమావేశం

(మొదటి తరువాయి)

ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారెంటీల్లోని ముఖ్యమైన సంక్షేమ పథకాల అమలు తీరును సమీక్షించనున్నారు. ముఖ్యంగా ఎంతోమంది ఎదురుచూస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పంపిణీకి సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని సమాచారం. దరఖాస్తు చేసుకున్న పేదలు, అర్హులందరికీ త్వరగా లబ్ధి చేకూర్చేలా స్పష్టమైన మార్గదర్శకాలను ఈ కేబినెట్ భేటీలో ఖరారు చేయనున్నారు. వీటితో పాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఆదాయ మార్గాలు, రాబోయే రోజుల్లో కొత్తగా చేపట్టాల్సిన ప్రాజెక్టులు తదితర అంశాలపై కూడా మంత్రులు సమాలోచనలు చేయనున్నారు. వ్యవసాయ రంగంలో రైతులకు అందించాల్సిన సాయం, పెండింగ్ బకాయిలపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలనను మరింత వేగవంతం చేసే దిశగా సీఎం రేవంత్ రెడ్డి తన మంత్రివర్గ సహచరులకు స్పష్టమైన దిశానిర్దేశం చేస్తారని భావిస్తున్నారు. పాలిటెక్నిక్?లను స్కిల్ ?యూనివర్సిటీలో విలీనానికి సంబంధించి కేశవరావు కమిటీ ఇచ్చిన నివేదికపై మంత్రిమండలిలో చర్చించి నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. నిషేధిత భూముల జాబితా నుంచి ఊరట కలిగించే అంశాలు, నూతన చేయూత పెన్షన్లు, రాజీవ్ యువ వికాసం, హైదరాబాద్ మెట్రో, మూసీ ప్రాజెక్టు, ఆర్ఆర్ఆర్, ఇందిరమ్మ చీరల పంపిణీపై కూడా చర్చ జరిగే అవకాశముంది. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల పునరుద్ధరణ, సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ, అంచనాల సవరణపై కేబినెట్ సమాలోచనలు చేయనున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ మంత్రివర్గ విస్తరణ మరింత జాప్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఖాళీగా ఉన్న 3 మంత్రి పదవులను భర్తీ చేయడంతో పాటు కొన్ని మార్పులు చేర్పులు ఉంటాయనే ప్రచారం చాలా కాలంగా జరుగుతోంది. అయితే ఈ ఏడాది చివరి వరకు విస్తరణ ఉండే అవకాశం లేదని, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీల ఎన్నిక దాకా కూడా వెళ్లవచ్చని విశ్వసనీయవర్గాల సమాచారం.

### జగన్, మమత, పవార్ కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలి

(మొదటి తరువాయి)

విమర్శలు చేశారు. తాము చెల్లించే ప్రతి రూపాయి పన్నుకు బదులుగా తెలంగాణకు కేవలం 43 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఉందని ఆరోపిస్తూ... చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను ఆయన సమర్థించుకున్నారు. ఇవి ఉచితాలు కావని, పేదలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చి, వారి కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే చర్యలని స్పష్టం చేశారు.

## లష్కరే టాప్ కమాండర్ హతం

శ్రీనగర్:

జమ్మూకశ్మీర్‌లోని బుద్గాం జిల్లాలో బుధవారం ఉదయం భద్రతా బలగాలకు, ఉగ్రవాదులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. యూస్‌మార్గ్ పరిధిలోని కోరాగ్ ప్రాంతంలో జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో లష్కరే తోయిబాకు చెందిన టాప్ కమాండర్ సులేమాన్ షా హతమైనట్లు భద్రతా వర్గాలు తెలిపాయి. అతడిని 'మూసా', 'ఫౌజీ మూసా' పేర్లతోనూ పిలిచేవారని అధికారులు పేర్కొన్నారు.

## క్రీడలకు అండగా నేనావత్ దేవరన్ నాయక్
# - దేవరకొండలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీల సందడి

**70వ SGF జిల్లాస్థాయి కబడ్డీ పోటీలకు భోజన సౌకర్యం, విజేతలకు భారీ బహుమతులు అందించిన దేవరన్ నాయక్ నల్లగొండ జిల్లా ఆరు నియోజకవర్గాల నుంచి తరలివచ్చిన వందలాది మంది క్రీడాకారులు - సబ్ కలెక్టర్ సమక్షంలో ఘన ప్రారంభం**





**దేవరకొండ, సెప్టెంబర్ 30 నవ సంఘర్షణ**
క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని, ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ అన్నారు. విద్యార్థులు, యువత క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.
దేవరకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న 70వ SGF జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు బుధవారం అత్యంత ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి దేవరకొండ సబ్ కలెక్టర్ గారు ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. వారి వెంట దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ గారు హాజరై క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు.
ఈ పోటీలకు ఎమ్మెల్యే బాలు నాయక్ గారి కుమారుడు శ్రీ నేనావత్ దేవరన్ నాయక్ గారు సంపూర్ణ సహకారం అందిస్తున్నారు. పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులందరికీ రెండు పూటలా భోజన సౌకర్యం కల్పించడంతో పాటు, గెలుపొందిన విజేత జట్లకు భారీ బహుమతులు అందించే బహుమతుల ధాతగా దేవరన్ నాయక్ వ్యవహరిస్తున్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడంలో దేవరన్ నాయక్ గతంలోనూ ఎప్పుడూ ముందుండేవారని, గ్రామీణ ప్రాంత యువతను క్రీడల వైపు ప్రోత్సహిస్తూ తనవంతు సహకారం అందిస్తున్నారని నిర్వాహకులు, క్రీడాకారులు కొనియాడారు.

**ఆరు నియోజకవర్గాల నుంచి క్రీడాకారులు:**
ఈ 70వ SGF జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో దేవరకొండ, నల్లగొండ, నకిరేకల్, నాగార్జునసాగర్, మునుగోడు, మిర్యాలగూడ అనే ఆరు నియోజకవర్గాలకు చెందిన వందలాది మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొంటూ తమ ప్రతిభను చాటుతున్నారు. ఆటల పోటీల నిర్వాహకులు ప్రాంతాల వారిని కాకుండా నిష్పక్షపాతంగా ఎంపైరింగ్ చేసి నిజమైన క్రీడాకారులను విజేతలుగా చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ గారు కోరారు.

**దేవరకొండలో స్పోర్ట్స్ అకాడమీతో పాటు ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేస్తాం: ఎమ్మెల్యే బాలు నాయక్**
దేవరకొండ ప్రాంతంలో క్రీడలకు ఉన్న ఆదరణను దృష్టిలో పెట్టుకొని స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేయబోతున్నామని ఎమ్మెల్యే బాలు నాయక్ వెల్లడించారు. అదే విధంగా దేవరకొండలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకోబోతున్నామని తెలిపారు. కబడ్డీతో పాటు బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ తదితర ఇండోర్ క్రీడల్లో యువత శిక్షణ పొందేందుకు అవసరమైన వసతులు కల్పించడమే లక్ష్యమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను వెలికితీసి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

**రూ.9.60 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్:**
దేవరకొండ ప్రాంతంలో విద్యా రంగాన్ని మరింత అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు. ఇందులో భాగంగా రూ.9.60 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు, క్రీడా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

**ప్రభుత్వ జూనియర్ కాలేజీ అభివృద్ధికి రూ.2.50 కోట్లు:**
దేవరకొండలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ అభివృద్ధికి రూ.2.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు. ముఖ్యమంత్రి శ్రీ ఏ. రేవంత్ రెడ్డి గారి చొరవతో ఈ అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీకి చారిత్రక ప్రాధాన్యత ఉందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి మామగారు, మాజీ కేంద్ర మంత్రి స్వర్గీయ సూదిని జైపాల్ రెడ్డి గారు ఇదే కళాశాలలో చదువుకున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

**దేవరకొండలోనే మోటార్ వెహికిల్ రిజిస్ట్రేషన్ సేవలు:**
ప్రజలకు పరిపాలనా సేవలను మరింత చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. గతంలో మోటార్ వెహికిల్ రిజిస్ట్రేషన్ వంటి పనుల కోసం దేవరకొండ ప్రాంత ప్రజలు మిర్యాలగూడకు వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం దేవరకొండలోనే ఈ సేవలు అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా అవుతున్నాయని తెలిపారు.

## ఎస్.వి. కృష్ణ ప్రసాద్ కి ఘనంగా జన్మదిన వేడుకలు తెలిపినా గడ్డి అన్నారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మద్దెల సునీల్ బాబు



**చైతన్య పురి సెప్టెంబర్ 30 నవ సంఘర్షణ**
ఎల్బీనగర్ నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ ప్రసాద్ ని శాలువాతో, గజమాలతో ఘనంగా సత్కరించి, కేక్ కట్ చేయించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డి అన్నారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మద్దెల సునీల్ బాబు వై.వి. కృష్ణారెడ్డి, తిరుమల్ రెడ్డి చెన్నారెడ్డి, సన్నాయి శ్రీనివాస్ , బార్ శ్రీనివాస్, సాయికుమార్ (డింపు), నాగ మహేష్ , విజయ్ చౌదరి , కృష్ణ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. కృష్ణ ప్రసాద్ కి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో నిండిన దీర్ఘాయుష్షు కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారు
మద్దెల సునీల్ బాబు..

## చెట్ల పొదల్లో
# వ్యక్తి మృతదేహం కలకలం



**చండూరు సెప్టెంబర్ 30 నవ సంఘర్షణ**
నల్గొండ జిల్లా చండూరు మండలం ఉడుతలపల్లి గ్రామ శివారులో ఓ వ్యక్తి మృతదేహం అనుమానాస్పద స్థితిలో కనిపించడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. బుధవారం ఉదయం రోడ్డు పక్కన గడ్డి పొదల్లో మృతదేహం పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న చండూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని కనగల్ మండలం పోనుగోడు గ్రామానికి చెందిన బండమీది శ్రీను (35)గా గుర్తించారు. శ్రీను కూరంపల్లి గ్రామంలో బైక్ మెకానిక్ షాప్ నిర్వహిస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

**ప్రమాదమా? హత్యా?**
మంగళవారం రాత్రి ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. అయితే మృతదేహం లభించిన తీరు, పరిసరాల్లో ఉన్న ఆనవాళ్లను బట్టి పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. మృతదేహం లభించిన ప్రదేశంతో పాటు పరిసర ప్రాంతాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. మృతుడి మరణానికి గల పూర్తి కారణాలు పోస్టుమార్టం నివేదిక, పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

## పిల్లల్లోని ప్రతిభను గుర్తించి వారిని సరైన దిశలో ప్రోత్సహించడం
# ప్రతి తల్లిదండ్రుల బాధ్యత. ఎస్పీ డా. శబరీష్,, ఐపీఎస్.

**మహబూబాబాద్ జిల్లా సెప్టెంబర్ 30 నవ సంఘర్షణ**
కరాటే పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించిన పోలీస్ కానిస్టేబుల్ కుమారుడు విఘ్నేష్‌ను అభినందించిన మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఐపీఎస్
వరల్డ్ ఫునాకోషి షోటోకాన్ కరాటే ఆర్గనైజేషన్ (WFSKO) ఆధ్వర్యంలో ముంబైలోని ప్రియదర్శిని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన 37వ ఆల్ ఇండియా / ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో మహబూబాబాద్ జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తున్న ఉన్న పోలీస్ కానిస్టేబుల్ సోమలింగయ్య కుమారుడు జి. విఘ్నేష్ యాదవ్ ప్రతిభ కనబరిచి రెండు స్వర్ణ పతకాలు సాధించాడు. అండర్-12 ఆరంజ్ బెల్ట్ విభాగంలో



అద్భుతమైన ప్రతిభను కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచి రెండు బంగారు పతకాలను (Gold Medals) విఘ్నేష్ గెలుపొందాడు.
ఈ సందర్భంగా సాధించిన విజయానికి గాను, జిల్లా పోలీస్ కార్యాలయంలో మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, IPS విఘ్నేష్ కు అభినందనలు తెలిపారు. చిన్న వయస్సులోనే జాతీయ/అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి జిల్లాకు, పోలీస్ కుటుంబానికి మంచి పేరు తెచ్చాడని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇదే పట్టుదలతో శ్రమించి మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని విఘ్నేష్‌ను ప్రోత్సహించారు.
అలాగే, విధులు నిర్వహిస్తూనే కుమారుడిని క్రీడల్లో ఎంతో ప్రోత్సహిస్తున్న తండ్రి, కానిస్టేబుల్ సోమలింగయ్యను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. పిల్లల్లోని ప్రతిభను గుర్తించి వారిని సరైన దిశలో ప్రోత్సహించడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత అని ఈ సందర్భంగా ఎస్పీ పేర్కొన్నారు.

## స్వచ్ఛత హి సేవ"లో భాగంగా చండూరు మున్సిపాలిటీలో హెల్త్ క్యాంపు



**చండూరు సెప్టెంబర్ 30 నవ సంఘర్షణ**
చండూరు పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక గెస్ట్ హౌస్ నందు హెల్త్ క్యాంపు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ డా. కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బంది ప్రతిరోజూ పట్టణ పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఎండ, వర్షం వంటి వాతావరణ పరిస్థితులను సైతం లెక్కచేయకుండా ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందిస్తున్న సిబ్బంది సేవలు అభినందనీయమని తెలిపారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమం ద్వారా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగస్వాములైన సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత, సురక్షితమైన తాగునీరు, పరిశుభ్రమైన ఆహారం, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ భూతరాజు దశరథ, పి హెచ్ సి డాక్టర్ ఆశా కిరణ్, మున్సిపల్ మేనేజర్ జి. రాములు, సీనియర్ అసిస్టెంట్ ఏ. సాయిభారద్వాజ్, వార్డ్ ఆఫీసర్ బి. సాయిరాం, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ యమ్. అరవింద్ రెడ్డి, ఏఎన్ఎం మంగమ్మ, ఆశా వర్కర్లు, పారిశుధ్య సిబ్బంది, వాటర్ సప్లై సిబ్బంది, ఎలక్ట్రీషియన్స్, మెప్మా సిబ్బంది మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కొండాపూర్ జిల్లా ఆసుపత్రి అభివృద్ధిలో భాగంగా మౌలిక వసతుల కల్పన కొరకు కలెక్టర్ కి పంపిన మంజూరీ పత్రాల జేసిన గాంధీ

**రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 01 నవ సంఘర్షణ**
కొండాపూర్ డివిజన్ పరిధిలోని కొండాపూర్ జిల్లా ఆసుపత్రి అభివృద్ధిలో భాగంగా మౌలిక వసతుల కల్పన కొరకు రూ. 10,00,000/- పది లక్షల రూపాయల వ్యయం తో ఎమ్మెల్యే నిధులతో మౌలిక వసతుల కల్పన కొరకు గాను నిధుల మంజూరి కొరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కి పంపిన మంజూరి పత్రాలను మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రకృష్ణ కి అందచేసిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ .ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధి మరియు నిర్వహణకు సంబంధించిన ప్రాథమిక మౌలిక వసతుల కొరకు రూ. 10,00,000/- పది లక్షల రూపాయల వ్యయం తో ఎమ్మెల్యే (సీడీపీ / ఎస్డీఎఫ్) ద్వారా పనులు చేపట్టడానికి నిధుల మంజూరి కొరకు కలెక్టర్ కి పంపడం జరిగినది అని, నిధులు మంజూరి కాగానే త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలియచేశారు. కొండాపూర్ జిల్లా ఆసుపత్రి అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, కార్పొరేటర్ ఆసుపత్రులకు దీటుగా



కొండాపూర్ జిల్లా ఆసుపత్రి ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని, అన్ని రకాల మౌళి వసతులు కల్పించి , పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా, ప్రజలకు మంచి నాణ్యమైన వైద్య సేవలు అందేలా తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలో ఉంటాయి అని తెలియచేశారు. కొండాపూర్ జిల్లా ఆసుపత్రిని బలోపేతం చేయడం మరియు ఇక్కడి పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడం పట్ల ప్రతి ఒకరు నిబద్ధత తో పనిచేయాలని, కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా కొండాపూర్ ఆసుపత్రిని తీర్చిదిద్దడం జరిగినది అని, కొండాపూర్ జిల్లా ఆసుపత్రి ని అన్ని రకాల మౌలిక వసతులతో, అన్ని హంగులతో , సకల సౌకర్యాలతో ఆసుపత్రి ని తీర్చిదిద్దడం జరిగినది అని, ఇక్కడి పరిసర ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది అని, 100 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ భవనం పనులు కొనసాగుతున్నాయి అని, త్వరలోనే అందుబాటులోకి వస్తుంది అని తెలియచేశారు. కొండాపూర్ జిల్లా ఆసుపత్రి అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలో ఉంటాయి అని, మీకు అన్ని విధాలుగా అండగా ఉంటానని, ఏ అవసరం ఉన్న, ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తామని తెలియచేశారు.

## సంపాదకీయం

# డ్రాగన్ తో చర్చలు సఫలీకృతం అయ్యేనా!?



భారత్ తో డ్రాగన్ మళ్లీ కలిసేందుకు సిద్ధమైంది. గత విద్వేషాలకు స్వస్తి పలుకుతూ భారత్ తో సుస్థిర బంధం ఏర్పరుచుకోవడానికి చైనా తహతహ లాడుతోంది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్, తదనంతర పరిణామాలతో భారత్ విమానయాన సంస్థలకు పాకిస్తాన్ తన గగనతలాన్ని మూసేసింది. దీంతో పాకిస్తాన్ మీదుగా వెళ్లాల్సిన భారత విమానాలు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఐరోపా, ఉత్తర అమెరికా వైపు వెళ్లే విమానాలు ఇతర మార్గాల్లో వెళ్తున్నాయి. దీనివల్ల ప్రయాణ సమయం, నిర్వహణ ఖర్చు పెరగడం వల్ల విమానయాన సంస్థలపై ఆర్థిక భారం పడుతోంది. ఈ నేపథ్యంలో భారత్ గత ఏడాది కాలంగా ప్రత్యామ్నాయ మార్గాల్ని అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా చైనాలోని హోటాన్ మీదుగా విమానాలు నడిపేందుకు అనుమతివ్వాలని డ్రాగన్ ను కోరుతోంది.అయితే ఇన్నాళ్లూ భారత్ చేసిన ఈ ప్రతిపాదనపై చైనా స్పందించడం లేదు. కానీ తాజాగా బ్రిక్స్ సదస్సు సందర్భంగా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ భారత్‌లో పర్యటించినప్పుడు.. ప్రధాని మోడీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చైనా అధికారులతో భారత అధికారులు చర్చలు జరుపుతున్నారు. భారత విమానయాన సంస్థలకు ప్రత్యామ్నాయ మార్గంగా జిన్‌జియాంగ్ గగనతలాన్ని ఇచ్చేందుకు భారత్.. చైనాతో చర్చలు జరుపుతోందని అధికారులు తెలిపారు. ప్రత్యామ్నాయ మార్గాలపై విదేశాంగ మంత్రిత్వ శాఖ చైనా ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతోందని వారు స్పష్టం చేశారు.జిన్‌పింగ్ ఢిల్లీ పర్యటనకు ముందు, చైనా సదరన్ ఎయిర్‌లైన్స్, ఆరు సంవత్సరాలుగా నిలిపివేసిన మార్గాన్ని పునరుద్ధరిస్తూ.. సెప్టెంబర్ 21 నుండి గ్వాంగ్‌జౌ–న్యూఢిల్లీ మధ్య ప్రత్యక్ష విమాన సర్వీసులను తిరిగి ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. కోవిడ్ మహమ్మారి, భారత్–చైనా సరిహద్దు వెంబడి నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. ఇరు దేశాల మధ్య ప్రత్యక్ష విమాన సంబంధాలను పునరుద్ధరించే ప్రయత్నంలో ఇదొక భాగం. భారత్–చైనా మధ్య పునఃప్రారంభించిన తొలి భారతీయ విమానయాన సంస్థ ఇండిగో. గత అక్టోబర్‌లో కోల్‌కతా–గ్వాంగ్‌జౌ మధ్య ఇండిగో సర్వీసులను పునఃప్రారంభించింది. నవంబర్‌లో ఢిల్లీ–గ్వాంగ్‌జౌ మధ్య కూడా భారత్–చైనా ప్రత్యక్ష విమాన సర్వీసులను తిరిగి ప్రారంభించింది. ఆ తర్వాత ఎయిర్ ఇండియా ఫిబ్రవరి 1న ఢిల్లీ–షాంఘై సర్వీసులను నడిపింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు చైనా మీదుగా ఇతర దేశాలకు వెళ్లేందుకు భారత్ అనుమతులు కోరుతోంది. మరోవైపు భారత్– చైనా మధ్య సంబంధాలు గతంతో పోలిస్తే నేడు మెరుగ్గా ఉన్నాయని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అభిప్రాయపడ్డారు. సరిహద్దు సమస్యలు పరిష్కారం కావడంతో ఇరు దేశాల సంబంధాలు సాధారణ స్థితికి చేరుకుంటున్నాయని అన్నారు. సోమవారం న్యూయార్క్‌లో 'ఆసియా సొసైటీ'లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న జైశంకర్ ఈ మేరకు స్పందించారు. "గతంతో పోలిస్తే ప్రస్తుతం సంబంధాలు మెరుగ్గా ఉన్నాయా అని నన్ను అడిగితే, 'అవును' అని అంటాను. 2024తో పోలిస్తే అవి మరింత మెరుగ్గా ఉన్నాయి." అన్నారు. 2020లో భారత్– చైనా మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు తలెత్తిన తర్వాత రెండు దేశాల మధ్య సాధారణ సంబంధాలు నిలిచిపోయాయని జైశంకర్ చెప్పారు. వాణిజ్యం కొనసాగినప్పటికీ, అధికారిక రాకపోకలు, వీసా జారీ, విమాన సర్వీసులు మాత్రం ప్రభావితమయ్యాయని వివరించారు. ఈ క్రమంలోనే సరిహద్దు ఉద్రిక్తతలు పరిష్కారం కాగానే, సంబంధాలు మెరుగుపడటం సహజమని అన్నారు. మేము ఒక అత్యంత ప్రాథమిక సూత్రానికి వచ్చాం. సరిహద్దు పరిస్థితే మన సంబంధాల స్థితిని నిర్ణయిస్తుంది. సరిహద్దులో ఉద్రిక్తతలు కొనసాగుతుండగా, సంబంధాలు మాత్రం సాధారణంగా ఉండాలని ఆశించడం సాధ్యం కాదు. సరిహద్దు పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుంటున్న కొద్దీ, మన సంబంధాలు కూడా సాధారణ స్థితికి వస్తాయి. సంబంధాలు సాధారణ స్థితికి రావడం వల్ల మన ఇద్దరికీ ప్రయోజనం చేకూరుతుంది. ఒక నిర్దిష్ట సమస్యపై మాత్రమే పూర్తిగా దృష్టి సారించి, తద్వారా నష్టపోయే పరిస్థితిని నేను కోరుకోను. నాకు అనుకూలమైన పరిష్కారం దొరికితే, దానినే ఎంచుకోవడానికి నేను ప్రాధాన్యం ఇస్తానని అన్నారు. మన మధ్య సంబంధాల్లో ప్రతిష్టంభన లేదా క్షీణత అనేది వాస్తవానికి మనలో ఎవరికీ ప్రయోజనం చేకూర్చదు. పైగా దీనివల్ల మూడో పక్షాలే లాభపడతాయి. ఇదే విషయాన్ని భారత్? చాలా కాలంగా చైనాకు చెబుతోంది. అలాగే, 'ఇతరులకు ప్రయోజనం చేకూర్చే సమస్యలో మనం చిక్కుకుపోకూడదు' అనే అత్యంత ప్రాథమిక దౌత్య సూత్రాన్ని కూడా మేము నిలకడగా పాటించాం. ఏ కారణం చేతనో, చైనా పక్షం దీనిని అంగీకరించడానికి కొంత సమయం పట్టింది. అయితే, ఆ సుదీర్ఘ ప్రతిష్టంభన మన ప్రయోజనాలకు ఏమాత్రం ఉపయోగపడలేదని నా అభిప్రాయం. అది వారికి కూడా ఏ విధంగానూ మేలు చేయలేదు. మన సంబంధాల్లో మెరుగుదల అనేది కేవలం చైనాతోనే కాకుండా, ప్రపంచ దేశాలతో మనకున్న సంబంధాల్లోనూ మన స్థానాన్ని బలోపేతం చేస్తుందని నేను భావిస్తున్నాను." అని జైశంకర్? అన్నారు. ఇటీవల కాలంలో ఇరు దేశాల సంబంధాల్లో సానుకూల మార్పులు కనిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే బ్రిక్స్ ( సదస్సు కోసం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భారత్‌లో పర్యటించడం వంటి పరిణామాలు జరిగాయి. మరోవైపు సీమాంతర ఉగ్రవాదమే భారత్‌కు ఉన్న ప్రధాన ఆందోళన అని విదేశాంగమంత్రి ఎా.జైశంకర్ అన్నారు. దశాబ్దాలుగా పొరుగు దేశం ఉద్దేశపూర్వకంగా ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తోందని పాకిస్థాన్‌ను ఉద్దేశించి తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రపంచంలో మరే దేశం కూడా భారత్‌లా ఉగ్రవాద బాధితురాలిగా లేదన్నారు. కీలకమైన ఈ ఆందోళనలను భాగస్వామ్య దేశాలు అర్థం చేసుకోకపోతే ద్వైపాక్షిక సంబంధాలపై కచ్చితంగా ప్రతికూల ప్రభావం పడుతుందని జైశంకర్ హెచ్చరించారు. మరోవైపు భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం ఖరారైతే ఇరు దేశాల సంబంధాలు మరింత మెరుగుపడతాయని జైశంకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రంప్ హయాంలో అమెరికా–పాకిస్థాన్ మధ్య బంధం బలపడుతున్న నేపథ్యంలో జైశంకర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఏదిఏమైనా ఇరు దేశాల మధ్య చర్చలు ఫలించి గగనతలంపై విమానాల రాకపోకలు మళ్లీ పునఃప్రారంభం కావాలి. ఇరు దేశాల మధ్య నెలకొన్న ఇతర సమస్యలపై కూడా అధికారులు దృష్టి సారించి సామరస్యంగా పరిష్కరించుకోవాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

# మైనర్ల డిజిటల్ భద్రతకు చట్టరక్షణ




మన దైనందిన జీవితంలో సామాజిక మాధ్యమాలు విడదీయలేని భాగంగా మారాయి. సమాచారాన్ని తెలుసుకోవడం, భావాలను వ్యక్తం చేయడం, ప్రపంచంతో అనుసంధానమవడం వంటి ఎన్నో ప్రయోజనాలు వీటి ద్వారా చేకూరుతున్నాయి. అయితే ఇదే వేదికలు బాలబాలికల పాలిట ప్రమాదకరంగా మారుతున్న సందర్భాలూ పెరుగుతున్నాయి. వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటున్న డిజిటల్ ప్రపంచంలో పిల్లల భద్రత ప్రశ్నార్థకమవుతోంది. సైబర్ వేధింపులు, అసభ్యకరమైన కంటెంట్, ఆన్‌లైన్ మోసాలు, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం, డిజిటల్ వ్యసనం వంటి సమస్యలు వారి శారీరక, మానసిక వికాసంపై ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో 18 ఏళ్లలోపు పిల్లలు సామాజిక మాధ్యమాల్లో ఖాతాలు తెరవడానికి తల్లిదండ్రుల సమ్మతిని తప్పనిసరి చేసే అంశాన్ని పరిశీలించాలని సుప్రీం కోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించడం ప్రాధాన్యం సంతరించుకుంది. మైనర్లు సామాజిక మాధ్యమాలను ఉపయోగించడం సమస్య కాదు. వారి వయసుకు తగిన అవగాహన, విచక్షణ, పరిణతితో సంబంధం లేకుండా ఎలాంటి నియంత్రణలూ లేని వాతావరణంలోకి ప్రవేశించడమే అసలు సమస్య. పిల్లలను ఆకట్టుకునేలా రూపొందించిన అల్గారిథమ్‌లు వారిని గంటల తరబడి తెరలకు అతుక్కుపోయేలా చేస్తున్నాయి.ఒక వీడియో చూసిన వెంటనే మరో వీడియోను, ఒక పోస్టు తర్వాత మరో పోస్టును చూపించే విధానం వారి సమయాన్ని హరిస్తోంది. చదువుపై ఏకాగ్రత తగ్గడం, నిద్రకు ఆటంకం కలగడం, శారీరక శ్రమ తగ్గడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇంతటితో సమస్యలు సమసిపోవడం లేదు. నకిలీ ఖాతాల ద్వారా పరిచయాలు పెంచుకొని పిల్లలను వలలో వేసుకోవడం, వ్యక్తిగత ఫొటోలు, వివరాలను సేకరించడం, వాటితో బెదిరింపులకు పాల్పడటం వంటి సైబర్ నేరాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. పిల్లలకు తెలియకుండానే వారి వ్యక్తిగత సమాచారం వాణిజ్య ప్రయోజనాలకు వినియోగమవుతోంది. అనుచితమైన దృశ్యాలు, హింసాత్మక కంటెంట్, తప్పుడు సమాచారం సైతం వారి దృష్టికి వస్తున్నాయి. ఒకసారి డిజిటల్ వేదికపైకి చేరిన వ్యక్తిగత సమాచారం పూర్తిగా తొలగిపోతుందన్న నమ్మకం లేదు. దాని దుర్వినియోగంవల్ల కలిగే నష్టాన్ని అర్థం చేసుకునే పరిణతి పిల్లలకు అన్ని సందర్భాల్లోనూ ఉండదు. భారతీయ ఒప్పందాల చట్టం ప్రకారం 18 ఏళ్లలోపు వ్యక్తులు స్వతంత్రంగా చట్టబద్ధమైన ఒప్పందాలు కుదుర్చుకోలేరు. కానీ ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్, స్నాప్‌చాట్, ఎక్స్ వంటి వేదికల్లో ఖాతా తెరిచే సమయంలో వినియోగ నిబంధనలకు అంగీకరించాల్సి ఉంటుంది. వయసును పుట్టిన తేదీ ఆధారంగా నిర్ధారిస్తున్నామని చెబుతున్నప్పటికీ, ఆ వివరాల నిజానిజాలను ధ్రువీకరించే వ్యవస్థలు ఎంత సమర్థంగా పనిచేస్తున్నాయన్నది ప్రశ్నార్థకమే. ఒప్పందం కుదుర్చుకునే చట్టపరమైన అర్హత లేని మైనర్లు డిజిటల్ వేదికల నిబంధనలకు అంగీకరిస్తున్నట్లు పరిగణించడం, ఆ ఒప్పందాల అమలుకు సంబంధించిన బాధ్యతలను నిర్ధారించడం వంటి అంశాలపై స్పష్టత అవసరం. ఈ వైరుధ్యాన్ని తొలగించకుండా పిల్లల డిజిటల్ భద్రతకు సంపూర్ణ రక్షణ కల్పించడం సాధ్యం కాదు. ఇప్పటికే డిజిటల్ వ్యక్తిగత సమాచార పరిరక్షణ చట్టం– 2023, సమాచార సాంకేతిక పరిజ్ఞాన చట్టం– 2000, ఐటి నిబంధనలు –2021 వంటి చట్టపరమైన వ్యవస్థలు అందుబాటులో ఉన్నాయి. పిల్లల వ్యక్తిగత సమాచారాన్ని ప్రాసెస్ చేయడానికి తల్లిదండ్రుల ధ్రువీకరించిన సమ్మతి పొందాల్సిన నిబంధనలూ ఉన్నాయి. అయినప్పటికీ, సామాజిక మాధ్యమాల్లో మైనర్లు ఖాతాలు తెరవడం, వయసును ధ్రువీకరించడం, తల్లిదండ్రుల సమ్మతిని నిర్ధారించడం, నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై చర్యలు తీసుకోవడం వంటి అంశాల్లో మరింత నిర్దిష్టమైన, సమర్థమైన అమలు వ్యవస్థ అవసరం. ఈ నేపథ్యంలో ఐటి నిబంధనలు– 2021లో తగిన సవరణలు తీసుకురావడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలి. ఖాతా ప్రారంభానికి ముందు వయసు నిర్ధారణ, తల్లిదండ్రులు లేదా సంరక్షకుల సమ్మతి ధ్రువీకరణ, పిల్లల వ్యక్తిగత సమాచారానికి రక్షణ, అనుచితమైన కంటెంట్ నియంత్రణ వంటి అంశాలకు చట్టబద్ధమైన ప్రాతిపదిక కల్పించాలి. అదే సమయంలో పిల్లల వ్యక్తిగత వివరాలను సేకరించే ప్రక్రియే వారి గోప్యతకు ముప్పుగా మారకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అయితే, తల్లిదండ్రుల సమ్మతిని తప్పనిసరి చేయడమే సమస్యలన్నింటికీ పరిష్కారం కాదు. వయసు నిర్ధారణలో లోపాలు, తప్పుడు వివరాలతో ఖాతాలు తెరవడం, తల్లిదండ్రులకు తెలియకుండా ఇతరుల ఖాతాలను ఉపయోగించడం వంటి అవకాశాలనూ పరిగణనలోకి తీసుకోవాలి. విద్య, సృజనాత్మకత, సమాచార సేకరణకు ఉపయోగపడే డిజిటల్ వనరులను పిల్లలకు పూర్తిగా దూరం చేయకుండా, వారి వయసుకు తగిన రీతిలో అందుబాటులో ఉంచే విధానాలనూ రూపొందించాలి. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న తరుణంలో చట్టాలు వెనుకబడిపోకూడదు. అలాగే, సుప్రీం కోర్టు లేవనెత్తిన అంశాన్ని ప్రభుత్వాలు మరో న్యాయపరమైన చర్చగా మాత్రమే చూడకుండా, బాలల హక్కుల పరిరక్షణకు అవసరమైన సంస్కరణలకు అవకాశంగా మలచుకోవాలి.

# మోడీ, అమిత్ షా మధ్య పెరుగుతున్న దూరం!



నరేంద్ర మోడీ ప్రభుత్వంలో ఎటువంటి సంక్షోభం ఎదురైనా వెంటనే రంగంలో దిగి ప్రభుత్వాన్ని, పార్టీని ఆదుకోవడంలో, రాజకీయ ప్రత్యర్థులపై కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగించి వారి విమర్శలను కట్టడి చేయడంలో ముందుండే హోం మంత్రి అమిత్ షా సుమారుగా 10నెలలుగా దాదాపు మౌనంగా ఉండటం రాజకీయ పరిశీలకులకు విస్మయం కలిగిస్తోంది. రెండు దశాబ్దాలకు పైగా గుజరాత్ నుండి జాతీయ రాజకీయాల వరకు ప్రధాని మోడీకి అత్యంత 'నమ్మిన బంటు' మాదిరిగా వ్యవహరిస్తూ, ఒక్కొక్క రాష్ట్రంలో బిజెపి ఎన్నికల యంత్రాంగాలను, ప్రచార తీరుతెన్నులను ఉధృతంగా రూపొందించడంలో కీలక పాత్ర వహిస్తూ వచ్చిన ఆయన ప్రాధాన్యత క్రమంగా తగ్గుతుందా? అనే అనుమానాలు పలువురికి కలుగుతున్నాయి. ముఖ్యంగా జులై 20న నీట్ పేపర్ లీక్‌కు నిరసనగా జంతర్ మంతర్ నుండి పార్లమెంట్ వరకు బొద్దింకలు జనతా పార్టీ నిర్వహించిన ప్రదర్శన హింసాయుతం కావడం, అందరి అంచనాలకు మించి విద్యార్థులు, యువకులు ఆ నిరసనలో పాల్గొనడం, నిరసనకారులు పోలీసుల లాఠీలను సైతం లెక్కచేయకుండా దాదాపు పార్లమెంట్ వరకు చేరుకోవడం, వారిని కట్టడి చేసేందుకు పోలీసులు అప్రదిష్టపాలైన పెల్లెట్ తుపాకీ గుండ్లను ఉపయోగించడం వంటి పరిణామాలు ప్రభుత్వ ప్రతిష్ఠను దిగజార్చాయి. అంతేకాకుండా, ఆ మరుసటి రోజు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ భద్రతా వలయాన్ని విస్మయపరిచే విధంగా నేరుగా ప్రధాని నివాసం వరకు చేరుకొని, బైఠాయించి మొదటిసారిగా ఓ కేంద్ర మంత్రితో రాజీనామా చేయించగలగడం తిరుగులేని నాయకుడిగా పేరొందిన నరేంద్ర మోడీ ప్రాబల్యంపై కోలుకోలేని విఘాతం కలిగించింది. పైగా, సిజెపి అధినేత అభిజిత్ దీప్కేకు ఢిల్లీ పోలీసులు విమానాశ్రయం వరకు వెళ్లి, తామే ఓ దరఖాస్తు తీసుకెళ్లి సంతకం చేయించి, జంతర్ మంతర్ వద్ద నిరసనకు అనుమతి అక్కడికక్కడే ఇచ్చారు. ఢిల్లీ పోలీసులు పెల్లెట్ తుపాకీ గుండ్లను ఉపయోగించలేదని మొదట్లో వాదించారు. బాధితులు ఫిర్యాదు చేసినా పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయలేదు. ఓ నెల రోజుల తర్వాత ఓ బాధితుడిని తీసుకొని స్వయంగా రాహుల్ గాంధీ ఓ పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లి బైఠాయించడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేయక తప్పలేదు. పైగా, తుపాకీ గుండ్ల దెబ్బలతో వచ్చిన వారికి చికిత్స చేశామని ఆసుపత్రి వర్గాలు స్పష్టం చేయడంతో సుప్రీం కోర్టు జోక్యం చేసుకొని పోలీసుల అత్యుత్సాహం ఆరోపణలపై దర్యాప్తుకు ఆదేశించింది. ఢిల్లీ పోలీసు వ్యవస్థ కేంద్ర హోం మంత్రి ప్రత్యక్ష పర్యవేక్షణలో పనిచేస్తూ ఉండడంతో ఆయన వ్యవహారంతో తన ప్రభుత్వం తరచూ ఇబ్బందులకు గురవుతున్నట్లు ప్రధాని మోడీ ఈ మధ్య భావిస్తున్నారనే ప్రచారం జరుగుతుంది. అందుకనే కేంద్ర మంత్రివర్గంలో సీనియర్లు అందరికీ ఉద్వాసన పలకాలనే 'కామరాజ్ ప్లాన్' వెనుక అమిత్ షాను గుజరాత్ రాజకీయాలకు పరిమితం చేయాలనే ఎత్తుగడ ఉందనే ప్రచారం ఈ సందర్భంగా జరుగుతుంది. ఢిల్లీ పోలీసులపై వచ్చిన ఆరోపణలపై ఇప్పటివరకు అమిత్ షా నోరు మెదపలేదు. పార్లమెంట్ ముందుకు వచ్చి ఓ ప్రకటన చేయమని ప్రతిపక్షాలు ఎంతగా ఒత్తిడి చేసినా మౌనంగానే ఉన్నారు. అప్పటినుంచి మోడీ ప్రభుత్వం ఎన్నో ప్రతికూలతలు ఎదుర్కొంటున్నా ఆయన మాట్లాడటం లేదు. యుపిఐ సేవలపై చార్జీల అంశం నుండి తాజాగా ఎన్నికల ప్రధాన కమిషనర్‌పై విమర్శల వరకు మౌనమే ఆశ్రయిస్తున్నారు. గతంలో మాదిరిగా ముందుండి ప్రభుత్వాన్ని, పార్టీని కాపాడే ప్రయత్నం చేయడం లేదు. గత లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి గణనీయంగా సీట్లు కోల్పోవడానికి తాను సూచించిన వారిని పక్కనపెట్టి అభ్యర్థులుగా ఇతరులను ఎంపిక చేయడమే కారణం అంటూ పరోక్షంగా అమిత్ షాపై ఆదిత్యనాథ్ స్పష్టంగా ఆరోపణలు చేశారు. అందుకనే రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో ఆదిత్యనాథ్ నాయకత్వమే బిజెపికి దిక్కనే నిర్ణయానికి ఆర్ఎస్ఎస్ పెద్దలు కూడా రావడంతో అభ్యర్థుల ఎంపిక నుండి, ఎన్నికల ప్రచారం వరకు 'కేంద్ర పెద్దలు' జోక్యం చేసుకోవద్దని స్పష్టం చేశారని చెబుతున్నారు.ప్రతిరోజూ దేశంలోని రాజకీయ పరిణామాలపై కేంద్ర హోంమంత్రిత్వ శాఖనుండి ప్రధాని కార్యాలయానికి సంక్షిప్త సమాచారం పంపుతూ ఉండటం ఆనవాయితీగా కొనసాగుతున్నది. అయితే ఇటీవల జాతీయ భద్రతా సలహాదారుడు అజిత్ దోవల్ నియమించిన ఓ ఐబి అధికారి ద్వారా ఇప్పుడు అటువంటి సమాచారం వెడుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఏదిఏమైనా ప్రధాని మోడీతో ఏర్పర్చుకున్న సాన్నిహితత్వం కారణంగా అమిత్ షా పార్టీలో, ప్రభుత్వంలో కీలకమైన నేతగా ఎదిగారని అందరికీ తెలిసిందే. మోడీ అండలేకుండా అమిత్ షా దూరంగా జరిగి, సొంతంగా నాయకత్వ స్థాయికి ఎదిగే ప్రశ్నలు తలెత్తే అవకాశం లేదు. దశాబ్దాలుగా వారి మధ్య నెలకొన్న సంబంధాల దృష్ట్యా వారిద్దరూ అటువంటి తీవ్రమైన పరిస్థితులను ఆహ్వానిస్తారని కూడా చెప్పలేము. కారణాలు ఏమైనా అమిత్ షా గత పది వారాలుగా కొన్ని అధికార కార్యక్రమాలకే పరిమితం అవుతున్నారు. కర్ణాటకలో ఓ అధికార కార్యక్రమానికి హాజరుకావాల్సి ఉన్నప్పటికీ 'అనారోగ్యం' పేరుతో ఆయన హాజరు కావడం లేదని మరో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రకటించారు. ఉమ్మడి పౌరస్మృతి చిరకాలంగా బిజెపి అజెండాలో ప్రముఖంగా ఉన్నప్పటికీ కేంద్రంలో పూర్తి మెజారిటీ ఉన్నప్పుడు కూడా ఎప్పుడూ అటువంటి బిల్లు తీసుకొచ్చే ప్రయత్నం జరగలేదు. కేవలం నాలుగు బిజెపి రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రమే అటువంటి బిల్లులు ఆమోదించగా, ఉత్తరాఖండ్‌లో మాత్రమే అమలు ప్రారంభమైంది. గుజరాత్, మధ్యప్రదేశ్, అసోం ప్రభుత్వాలు ఆమోదించిన బిల్లులు రాష్ట్రపతి ఆమోదం కోసం ఎదురు చూస్తున్నాయి. ఇప్పటికే ఎన్‌డిఎ మిత్రపక్షాలు అటువంటి బిల్లుల పట్ల తమ అభ్యంతరాలను బహిరంగపరిచాయి. అటువంటప్పుడు పార్టీ మూల సిద్ధాంతాలను ప్రస్తావించడం ద్వారా సైద్ధాంతికంగా బలమైన పునాదులు కలిగిన నేతగా చెప్పుకోవడం కోసం అమిత్ షా అటువంటి ప్రకటన చేశారా? అనే అనుమానం ఈ సందర్భంగా పలువురికి కలుగుతున్నది.

## సీఎం రేవంత్ రెడ్డికి
# ఘన స్వాగతం

- మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ లకు సత్కారం
- చైర్ పర్సన్ సుహాసిని మనోజ్ రావు ఆధ్వర్యంలో సన్మానం



**నవ సంఘర్షణ హుజురాబాద్ సెప్టెంబర్ 30**
కరీంనగర్ జిల్లా కేంద్రంలో నూతన సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కరీంనగర్ కలెక్టరేట్‌లోని ఎలిఫ్యాడ్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లను శాలువాలతో సత్కరించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## కేసీఆర్ నిర్మించిన భవనాలకు
# రిబ్బన్ కటింగ్ తప్ప కొత్తగా చేసిందేమిటి?

- రిబ్బన్ కటింగ్ సీఎంగా మిగిలిపోవద్దు: ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



**నవ సంఘర్షణ : హుజురాబాద్ సెప్టెంబర్ 30**
కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన భవనాలకు ప్రారంభోత్సవాలు చేయడం తప్ప ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్తగా చేసిందేమిటని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రశ్నించారు. కరీంనగర్ జిల్లా సమీకృత కలెక్టరేట్ భవనాన్ని కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మించగా, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారని పేర్కొన్నారు.
కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల సమీకృత కలెక్టరేట్ భవనాలతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు కౌశిక్ రెడ్డి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవాలు చేస్తూ, వాటిని కొత్త ప్రభుత్వం చేపట్టినట్లు ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు.
రేవంత్ రెడ్డి కేవలం “రిబ్బన్ కటింగ్ సీఎంగా” మిగిలిపోకుండా కొత్త అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. మాజీ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో సిరిసిల్లలో జరిగిన అభివృద్ధిని పరిశీలించి, ముఖ్యమంత్రి తన నియోజకవర్గమైన కొడంగల్‌లో కూడా ప్రజలకు కనిపించేలా అభివృద్ధి చేయాలని అన్నారు. కరీంనగర్ జిల్లాకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించాలని, హుజురాబాద్ నియోజకవర్గానికి రూ. 1,000 కోట్ల అభివృద్ధి పనులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రెండో విడత దళిత బంధు నిధులను వెంటనే లబ్ధిదారులకు విడుదల చేయాలని కోరారు. అలాగే కమలాపూర్ బస్టాండ్ మిగిలిన పనులకు నిధులు మంజూరు చేయడంతో పాటు కల్వల ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వీణవంక మండలంలోని దెబ్బతిన్న రహదారులను వెంటనే మరమ్మతులు చేయాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామని చెప్పడం కాదని, ప్రజలకు ఉపయోగపడే కొత్త అభివృద్ధి పనులు చేసి చూపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కోరారు.

## శానిటేషన్ కార్మికులకు
# ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం





**కామారెడ్డి జిల్లా : నవ సంఘర్షణ సెప్టెంబర్ 30**
కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో శానిటేషన్ కార్మికుల కోసం ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటేషన్ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యంపై అవసరమైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతిరోజూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం పనిచేసే పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం, సంక్షేమంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వృత్తిపట్ల నిబద్ధతతో పనిచేయడంతో పాటు, తమ ఆరోగ్యంపై కూడా కార్మికులు శ్రద్ధ వహించాలని సూచించారు. వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ కాసార్ల గోదావరి, మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, డీఈ హనుమంతరావు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, శానిటేషన్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## దళిత బంధు కోసం
# పోరాడుతున్న వారిపై అక్రమ అరెస్టులా?

- హక్కుల కోసం పోరాడితే అణిచివేయడం సరికాదు..
- దళిత బంధు నాయకులు అకినపల్లి ప్రవీణ్




**నవ సంఘర్షణ హుజురాబాద్, సెప్టెంబర్ 30**
కరీంనగర్ నూతన సమీకృత కలెక్టరేట్ కార్యాలయ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి పర్యటనకు అడ్డంకులు కలిగిస్తారనే అనుమానంతో హుజురాబాద్ నియోజకవర్గంలో దళిత బంధు కోసం పోరాటం చేస్తున్న పలువురిని ముందస్తుగా అరెస్ట్ చేయడం బాధాకరమని దళిత బంధు సాధన కోసం పోరాడుతున్న అకినపల్లి ప్రవీణ్ పేర్కొన్నారు.
2023లో ప్రారంభమైన దళిత బంధు పథకం అమలు పూర్తికాకపోవడంతో హుజురాబాద్ నియోజకవర్గంలోని లబ్ధిదారులు, బాధితులు తమ సమస్య పరిష్కారం కోసం ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. ఈ అంశంపై మాట్లాడిన, పోరాడిన వందలాది మందిని ముందస్తు అరెస్టులు చేయడం ప్రభుత్వం, పోలీసు వ్యవస్థకు తగదని ఆయన అన్నారు. హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం చేస్తున్న వారిని అరెస్టుల పేరుతో అణిచివేయాలని చూడటం సరికాదని ప్రవీణ్ పేర్కొన్నారు. దళిత బంధు పూర్తి స్థాయిలో అమలు అయ్యే వరకు ఎన్ని అరెస్టులు చేసినా తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో బొడ్డు భాస్కర్, సుధాకర్, అంజాద్ ఖాన్, ఇమ్రాన్‌తో పాటు పలువురిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. దళిత బంధు సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, అర్హులైన లబ్ధిదారులకు పథకం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## చలో సిరిసిల్లకు బయలుదేరిన
# ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి



**కామారెడ్డి జిల్లా : నవ సంఘర్షణ సెప్టెంబర్ 30**
చలో సిరిసిల్ల కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి సమావేశానికి హాజరయ్యేందుకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి బుధవారం కామారెడ్డి నుంచి సిరిసిల్లకు బయలుదేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గడ్డం చంద్రశేఖర్ రెడ్డితో పాటు కామారెడ్డి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మామిళ్ల అంజయ్య, కామారెడ్డి జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ గడ్డం మీది మహేష్, తాటి లావణ్య ప్రసాద్, డీసీసీ జనరల్ సెక్రటరీ జూలూరి సుధాకర్, మాజీ కౌన్సిలర్లు చాట్ల వంశీ, రవీందర్ గౌడ్, సుగుణ, సేవాదళ్ యూత్ అధ్యక్షుడు నర్సుల మహేష్ తదితరులు సిరిసిల్లకు బయలుదేరారు. వారితో పాటు ఆబేద్, బల్ల శ్రీనివాస్, పందు శ్రీకాంత్, దేవేందర్, రాహుల్, శశి, భాస్కర్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నషా ముక్త్-టీబీ ముక్త్
# భారత్‌పై అవగాహన ర్యాలీ






**కామారెడ్డి : నవ సంఘర్షణ సెప్టెంబర్ 30**
ఆర్కే డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఎన్సీసీ క్యాడెట్ల ఆధ్వర్యంలో నషా ముక్త్--టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా బుధవారం అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, టీబీ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేసి, “డ్రగ్స్ వద్దు.. జీవితం ముద్దు” అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఆర్కే విద్యాసంస్థల సీఈఓ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో విద్యతో పాటు దేశభక్తి, నైతిక విలువలను పెంపొందించడమే లక్ష్యమన్నారు. సామాజిక సమస్యలపై అవగాహన కార్యక్రమాల్లో ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాలు ముందుంటాయని తెలిపారు. కార్యక్రమంలో డీన్ నవీన్, ప్రిన్సిపాల్ గోవర్ధన్ రెడ్డి, ఏఓ శ్రీధర్, ఎన్సీసీ ఆఫీసర్ శ్రీకాంత్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ లింగం, అధ్యాపకులు, ఎన్సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాట ఇచ్చిన 15 రోజుల్లో
# సీసీ రోడ్డు పూర్తి





**కామారెడ్డి : నవ సంఘర్షణ సెప్టెంబర్ 30**
కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ 15 రోజుల్లోనే సీసీ రోడ్డు పనులను పూర్తి చేయించారు. ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి నుంచి కళాశాల వరకు రూ. 12 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు పనులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తే ప్రభుత్వ ప్రాధాన్యత అని, విద్యతో పాటు కళాశాలల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కళాశాలలో 1,100 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. నూతన తరగతి గదుల నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# చిన్న పొదుపు పథకాలపై వడ్డీ రేట్లు యథాతథం

**-ఎలాంటి మార్పు లేదని ప్రకటించిన కేంద్ర ఆర్థిక శాఖ**




న్యూఢిల్లీ,

చిన్న మొత్తాల పొదుపు పథకాలపై పెట్టుబడి పెట్టే వారికి కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. 2026–27 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి (అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31, 2026 వరకు) వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దీంతో గత త్రైమాసికంలో అమలైన వడ్డీ రేట్లే మరో మూడు నెలల పాటు కొనసాగనున్నాయి. ఈ నిర్ణయంతో పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)పై వడ్డీ రేటు 7.1 శాతం వద్ద స్థిరంగా ఉండనుంది. ఇక సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్ఎస్), సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై) పథకాలపై అత్యధికంగా 8.2 శాతం వడ్డీ లభించనుంది. అదేవిధంగా, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ)పై 7.7 శాతం, కిసాన్ వికాస్ పత్ర (కేవీపీ)పై 7.5 శాతం వడ్డీ రేటు కొనసాగుతాయి. వీటితో పాటు పోస్టాఫీస్ టైమ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లపై కూడా పాత వడ్డీ రేట్లే వర్తించనున్నాయి. ప్రభుత్వ సెక్యూరిటీల రాబడులకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ప్రతి త్రైమాసికానికోసారి ఈ వడ్డీ రేట్లను సమీక్షిస్తుంది. అయితే, దీనిపై తుది నిర్ణయం తీసుకునే అధికారం ప్రభుత్వం వద్దే ఉంటుంది. గతేడాది డిసెంబర్‌లో కొన్ని పథకాలపై వడ్డీ రేట్లను స్వల్పంగా సవరించినప్పటికీ, అప్పటి నుంచి మెజారిటీ పథకాలపై రేట్లను స్థిరంగానే కొనసాగిస్తున్నారు. ఎటువంటి రిస్క్ లేకుండా స్థిరమైన, ప్రభుత్వ హామీ కలిగిన రాబడిని ఆశించే పెట్టుబడిదారుల నుంచి ఈ చిన్న మొత్తాల పొదుపు పథకాలకు విశేష ఆదరణ లభిస్తోంది.

## అక్టోబర్ 2న యూపీఐ సేవలు పనిచేస్తాయ్!

**-'నో యూపీఐ డే' నిరసనను విరమణ**

**-నిర్మలా సీతారామన్‌తో వ్యాపారవేత్తల భేటీ**




న్యూఢిల్లీ,

యూపీఐ లావాదేవీలపై ప్రతిపాదించిన ఎండీఆర్ ఛార్జీకి వ్యతిరేకంగా అక్టోబర్ 2న చేపట్టాలనుకున్న 'నో యూపీఐ డే' నిరసనను వ్యాపార సంఘాలు విరమించుకున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో బుధవారం జరిగిన సమావేశం తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 20 మంది వ్యాపార ప్రతినిధులు నిర్మలా సీతారామన్‌ను కలిశారు. రూ.2,000కు మించిన మర్చంట్ యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఫీజు విధించే ప్రతిపాదనపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఛార్జీతో చిన్న, మధ్య తరహా వ్యాపారాలపై భారం పెరుగుతుందని తెలిపారు. డిజిటల్ చెల్లింపుల వినియోగం కూడా ప్రభావితమయ్యే అవకాశం ఉందని చెప్పారు. చాందినీ చౌక్ ఎంపీ, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్‌వాల్ నేతృత్వంలో ఈ ప్రతినిధి బృందం సమావేశమైంది. ప్రతిపాదిత ఛార్జీపై స్పష్టత ఇవ్వాలని కోరింది. వ్యాపారుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. సమావేశం తర్వాత ఖండేల్‌వాల్ మాట్లాడుతూ.. కేంద్రంతో చర్చలు సానుకూలంగా జరిగాయని తెలిపారు. వ్యాపారులు లేవనెత్తిన అంశాలను ప్రభుత్వం పరిశీలిస్తుందన్న భరోసా లభించిందన్నారు. దీంతో అక్టోబర్ 2న తలపెట్టిన నిరసనను ఉపసంహరించుకున్నట్లు చెప్పారు. ఆల్ ఇండియా కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ ఫెడరేషన్, ఆల్ ఇండియా మొబైల్ రిటైలర్స్ అసోసియేషన్ తొలుత 'నో యూపీఐ డే'కు పిలుపునిచ్చాయి. అయితే కేంద్రంతో చర్చల తర్వాత ఆ పిలుపును వెనక్కి తీసుకున్నాయి. ఇదిలా ఉండగా.. రూ.2,000కు మించిన అర్హత ఉన్న మర్చంట్ యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఫీజు అక్టోబర్ 15 నుంచి అమల్లోకి రావాల్సి ఉంది. మరోవైపు యూపీఐపై జీఎస్టీ భారం పెరుగుతుందన్న వార్తలను ఎన్‌పీసీఐ గతంలో ఖండించింది. రూ.2,000 వరకు జరిగే లావాదేవీలకు జీరో ఎండీఆర్ కొనసాగుతుందని స్పష్టం చేసింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం యూపీఐ వ్యాపార లావాదేవీల్లో 96 శాతానికి పైగా రూ.2,000లోపే ఉన్నాయి.

## రూ.3 వేల కోట్ల విలువైన 526 కేజీల డ్రగ్స్ స్వాధీనం

**-ఇరానీ బోటులో భారీగా మాదకద్రవ్యాల పట్టివేత**

**-పాకిస్థానీ జాతీయుల ఆధ్వర్యంలో నౌక**

**-హెరాయిన్, మెథంఫిటమైన్ స్వాధీనం**

**-లక్షద్వీప్ సమీపంలోని అరేబియా సముద్రంలో ఆపరేషన్**

**-కోస్టుగార్డ్, గుజరాత్ ఏటీఎస్ సంయుక్త చర్యలు**

**-సెప్టెంబర్ 25న చేపట్టిన ఆపరేషన్**

**-సముద్ర, వైమానిక నిఘాతో నౌకను పట్టుకున్న అధికారులు**

**-డ్రగ్స్, సిబ్బందిని ముంబైకి తరలింపు**



న్యూఢిల్లీ:

అరేబియా సముద్రంలో భారీగా మాదకద్రవ్యాలను భారత కోస్టుగార్డ్, గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్(ఏటీఎస్) సంయుక్తంగా స్వాధీనం చేసుకున్నాయి. లక్షద్వీప్ సమీపంలో ఇరానీ నౌకలో అక్రమంగా తరలిస్తున్న 526 కిలోల మాదకద్రవ్యాలను పట్టుకున్నారు. వీటి విలువ సుమారు రూ.3 వేల కోట్ల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు.

పాకిస్థానీ సిబ్బంది

సెప్టెంబర్ 25న చేపట్టిన ఈ ఆపరేషన్‌లో సముద్ర, వైమానిక నిఘా వ్యవస్థలను ఉపయోగించి అనుమానాస్పద నౌకను గుర్తించారు. అనంతరం దానిని అదుపులోకి తీసుకుని తనిఖీలు నిర్వహించగా భారీగా డ్రగ్స్ బయటపడ్డాయి. నౌకను పాకిస్థానీ జాతీయులు నిర్వహిస్తున్నట్లు కోస్టుగార్డ్ అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాల్లో హెరాయిన్, మెథంఫిటమైన్ ఉన్నట్లు గుర్తించారు. డ్రగ్స్‌తో పాటు నౌక సిబ్బందిని కూడా అదుపులోకి తీసుకుని తదుపరి దర్యాప్తు కోసం ముంబైకి తరలించినట్లు అధికారులు వెల్లడించారు.

# ఎలాన్ మస్క్, డెల్టా సీఈవో మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి..!

న్యూఢిల్లీ:

ప్రముఖ విమానయాన సంస్థ డెల్టా ఎయిర్‌లైన్స్ సీఈవో ఎడ్ బాస్టియన్ , టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. తమ విమానాల్లో వైఫై సేవల కోసం మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ ను కాదని, అమెజాన్ కు చెందిన 'లియో' శాటిలైట్ వ్యవస్థను ఎడ్ బాస్టియన్ ఎంచుకోవడంపై మస్క్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు డెల్టా సీఈవో ఎడ్ బాస్టియన్ తన ఉద్యోగాన్ని కోల్పోతారని హెచ్చరించారు. ఈ హెచ్చరికలు ఇప్పుడు సంచలనంగా మారాయి. డెల్టా సీఈవో ఎడ్ బాస్టియన్.. ఎలాన్ మస్క్ ప్రతిష్టపై చేసిన వ్యాఖ్యలే ఈ వివాదానికి కారణంగా తెలుస్తోంది. ఒక కంపెనీ కార్యక్రమంలో ఉద్యోగులతో కలిసి మాట్లాడుతూ.. మస్క్‌తో కలిసి పనిచేయడానికి తాము ఇష్టపడటంలేదని ఎడ్ బాస్టియన్ అన్నట్లు ఏవియేషన్ రిపోర్టర్ ఒకరు వెల్లడించారు. 'మస్క్ ప్రతిష్ఠ గురించి మీకు తెలిస్తే ఆయన గురించి బయట చెప్పేవన్నీ నిజాలే' అని ఎడ్ బాస్టియన్ వ్యాఖ్యానించినట్లు ఆ




రిపోర్ట్ పేర్కొన్నది. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవడంతో మస్క్ దృష్టికి వెళ్లాయి. దీనిపై ఆయన ఘాటుగా స్పందించారు. 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. ఎడ్ బాస్టియన్ తన నిర్ణయంవల్ల తన ఉద్యోగాన్ని కోల్పోతారని హెచ్చరించారు. అంతటితో ఆగకుండా డెల్టా కనెక్టివిటీపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. స్టార్‌లింక్ కనెక్టివిటీ లేనందున ఒక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వ్యవస్థను బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా చేయాలంటే దాన్ని డెల్టా విమానంలో ఉంచడమే సరైన మార్గమన్నారు. ఈ నిర్ణయంవల్ల డెల్టా గణనీయమైన సంఖ్యలో కస్టమర్లను కోల్పోవచ్చని ఆయన గతంలోనే హెచ్చరించారు. గత మార్చి నెలలో డెల్టా ఎయిర్‌లైన్స్, అమెజాన్‌తో బహుళ-సంవత్సరాల ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం 2028 నుంచి దశలవారీగా 500 విమానాల్లో అమెజాన్ 'లియో' శాటిలైట్ ఆధారిత వైఫై సేవలను ప్రారంభించనుంది. అయితే యునైటెడ్ ఎయిర్‌లైన్స్ వంటి అనేక ప్రత్యర్థి సంస్థలు ఇప్పటికే తమ విమానాల్లో వేగవంతమైన స్టార్‌లింక్ సేవలను అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో డెల్టా నిర్ణయం చర్చనీయాంశంగా మారింది.

# ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్‌కు షాక్..

**- మరోసారి బెయిల్ నిరాకరించిన ఢిల్లీ హైకోర్టు**

**--2020 ఢిల్లీ అల్లర్ల కేసులో ఢిల్లీ హైకోర్టు కీలక నిర్ణయం**

**-యూఏపీఏ కేసులో బెయిల్ పిటిషన్లు కొట్టివేత**

**-సుప్రీంకోర్టు గత ఆదేశాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం**



న్యూఢిల్లీ:

ఢిల్లీ అల్లర్ల కేసు నిందితులు ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్‌కు కోర్టులో మరోసారి షాక్ తగిలింది. ఇద్దరికీ బెయిల్ ఇచ్చేందుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. 2020 ఢిల్లీ అల్లర్ల కేసులో ఇద్దరూ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోగా.. బుధవారం కోర్టు డిస్మిస్ చేసింది. ఈ అంశంలో ఇప్పటికే సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల్ని దృష్టిలో ఉంచుకుని బెయిల్ ఇవ్వలేమని కోర్టు తెలిపింది. ఖలీద్, ఇమామ్ ఇద్దరికి ఢిల్లీ హైకోర్టు బెయిల్ నిరాకరించడం ఇది మూడోసారి. జస్టిస్ ప్రతిభా ఎం సింగ్, జస్టిస్ దినేష్ భట్‌తో కూడిన ధర్మాసనం బెయిల్‌పై నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో గత జనవరి 5న సుప్రీంకోర్టు నిందితులకు బెయిల్ నిరాకరించింది. అయితే, అందరు సాక్షుల విచారణ పూర్తి అయిన తర్వాత లేదా ఏడాది తర్వాత.. రెండింటిలో ఏది ముందైతే దానికి అనుగుణంగా బెయిల్ కోసం మంజూరు చేసుకోవాలని సూచించింది. ఇద్దరిపై దేశంలో అత్యంత కీలకమైన ఉపా చట్టం కింద కేసు నమోదైందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలివి. కేంద్రం తీసుకొచ్చిన సీఏఏ చట్టానికి వ్యతిరేకంగా ఢిల్లీలో ఫిబ్రవరి 2020లో ఆందోళన జరిగింది. ఈ ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. ఈ సమయంలో 53 మంది మరణించారు. 700 మంది గాయపడ్డారు. తీవ్ర ఆస్తి నష్టం కూడా జరిగింది. అత్యంత హింసాత్మకంగా జరిగిన ఈ ఆందోళనకు ప్రధాన కారకులుగా ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్ సహా పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆప్ మాజీ నేత ఖలిద్ సైఫి, తాహిర్ హుస్సేన్ సహా పలువురిని అరెస్టు చేశారు. ఖలిద్‌ను సెప్టెంబర్ 13, 2020న అరెస్టు చేశారు. అప్పటినుంచి అతడు జైలులోనే ఉన్నాడు. గత జూలై 4న కూడా కోర్టు అతడికి బెయిల్ నిరాకరించింది.

# ట్రంప్- మోదీ ఫోన్ సంభాషణ

**-ద్వైపాక్షిక సహకారం, వాణిజ్య అంశాలపై చర్చ!**

**-ప్రపంచ శాంతి భద్రతలపైనా సమాలోచనలు**



న్యూఢిల్లీ

భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం అత్యంత ప్రాధాన్యత కలిగిన ఫోన్ సంభాషణ జరిగింది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న తాజా పరిణామాల నేపథ్యంలో ఇరు దేశాల అగ్రనేతలు ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృతంగా సమీక్షించారు. అధ్యక్షుడు ట్రంప్‌తో ఫలప్రదమైన చర్చలు జరిగాయని ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా అధికారికంగా వెల్లడించారు. భారత్, అమెరికా మధ్య పరస్పర వాణిజ్యం, రక్షణ బలోపేతం, స్వచ్ఛ ఇంధన వనరులు, కీలక అధునాతన సాంకేతిక రంగాలలో సహకారాన్ని మరింత విస్తరించడంపై ఇద్దరు నేతలు దృష్టి సారించారు.

ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ముందుకు నడిపించేందుకు పరస్పర సమన్వయంతో కలిసి పనిచేయాలని నిర్ణయించారు. అంతర్జాతీయ వాణిజ్య చర్చలు, ప్రాంతీయ భద్రతా వ్యవహారాలు కొనసాగుతున్న తరుణంలో ఈ ఫోన్ కాల్ చర్చ జరగడం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆసక్తి రేకెత్తించింది. ద్వైపాక్షిక సంబంధాల్లో కీలకమైన భద్రతా ఒప్పందాల అమలుపై నేతలిద్దరూ సమాలోచనలు జరిపినట్లు న్యూస్18 ఇంగ్లీష్ కథనం పేర్కొంది. సైనిక రంగంలో పరస్పర భాగస్వామ్యాన్ని పెంపొందించడం, ఇరు దేశాల రక్షణ పరిశ్రమల అనుసంధానాన్ని వేగవంతం చేయడంపై చర్చించారు. రక్షణ రంగంతో పాటు అత్యాధునిక సాంకేతికతల బదిలీ, కృత్రిమ మేధ, పరిశోధనలలో సంయుక్తంగా అడుగులు వేయడంపై ఏకాభిప్రాయం వ్యక్తమైంది. ఇంధన రంగంలో దేశ భద్రతను పటిష్టం చేసుకుంటూనే వాణిజ్య విస్తరణకు ఉన్న అవకాశాలను ఇరు దేశాలు సమీక్షించాయి. ప్రపంచ చమురు మార్కెట్ ఒడిదుడుకులు, సహజ వనరుల సరఫరాలో స్థిరత్వాన్ని సాధించేందుకు పరస్పర సహకారం కొనసాగించాలని ఇరు పక్షాలు నిర్ణయించుకున్నాయి. ఆర్థిక ప్రయోజనాలే లక్ష్యంగా వాణిజ్య సుంకాలు, మార్కెట్ భాగస్వామ్యంపై ఉన్న సవాళ్లను సామరస్యంగా పరిష్కరించుకోవాలని భావించారు. సమగ్ర అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని (కాంప్రిహెన్సివ్ గ్లోబల్ స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్) నూతన శిఖరాలకు చేర్చేందుకు నిరంతర సంప్రదింపులు కొనసాగించాలని ఇరువురు నేతలు నిర్ణయించారు. ప్రపంచ శాంతి, ప్రాంతీయ సుస్థిరత కోసం ఇరు దేశాల బలమైన మైత్రి ఎంతో కీలకమని నేతలు అభిప్రాయపడ్డారు. గ్లోబల్ సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ, పారిశ్రామిక స్థాయిలలో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

# తండ్రి మృతదేహంతో నాలుగేళ్లు.. కుమార్తె సంచలన నిర్ణయం

**--2022లో గుండెపోటుతో తండ్రి మృతి**

**-అంత్యక్రియలు చేయకుండా మృతదేహాన్ని భద్రపరిచిన కుమార్తె**

**-మూసివేసిన డే కేర్ సెంటర్‌లో మృతదేహం**

**-తీవ్ర దుర్వాసనతో పోలీసులకు సమాచారం**

**-తాళం పగలగొట్టి లోపలికి వెళ్లిన పోలీసులు**

**-కుళ్లిన స్థితిలో మృతదేహం గుర్తింపు**

**-విదేశీ సంస్థ సహాయంతో మృతదేహాన్ని భద్రపరిచినట్లు వెల్లడి**

**-కుటుంబ, చట్టపరమైన అంశాలపై పోలీసుల దర్యాప్తు**

ముంబై:

తండ్రి చనిపోయినా తనతోనే ఉండాలని ఒక మహిళ భావించింది. ఈ నేపథ్యంలో నాలుగేళ్లుగా ఆయన మృతదేహాన్ని భద్రపరిచింది. అయితే దుర్వాసన రావడంపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. (ఔశీఎ్ఖఅ ౯ాతీవంవతీజవం ఖీశ్ఞ్ట్రవతీం దీశీసఎ) మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఈ సంఘటన జరిగింది. మలాడ్ ఈస్ట్ ప్రాంతంలో మూసివేసి ఉన్న ఒక డే కేర్ సెంటర్ నుంచి తీవ్ర దుర్వాసన వస్తుండటాన్ని స్థానికులు గమనించారు.




రోజురోజుకూ ఆ వాసన మరింత తీవ్రం కావడంతో వారు అనుమానించారు. ఆ దుర్వాసన భరించలేనంతగా మారడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కాగా, మూసి ఉన్న ఆ డే కేర్ సెంటర్ వద్దకు పోలీసులు చేరుకున్నారు. గేట్‌కు వేసి ఉన్న లాక్ బ్రేక్ చేసి లోపలకు వెళ్లారు. అక్కడ సోదా చేయగా కుళ్లిన స్థితిలో ఉన్న ఒక మృతదేహం కనిపించింది. పోలీసులు ఆరా తీయగా 2022లో ఆ వృద్ధుడు గుండెపోటుతో మరణించినట్లు తెలిసింది. మరోవైపు మరణించిన తండ్రిని తనతోనే ఉంచుకోవాలని ఆయన కుమార్తె భావించింది. దీంతో మృతదేహాన్ని భద్రపరచాలని నిర్ణయించిన ఆమె అంత్యక్రియలు నిర్వహించలేదు. ఒక విదేశీ సంస్థ సహాయంతో తండ్రి మృతదేహాన్ని భద్రపరిచేలా ఏర్పాట్లు చేసింది. అయితే తన తండ్రిపై ఆ మహిళకు ఉన్న అపారమైన ప్రేమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణంగా తెలుస్తున్నదని పోలీస్ అధికారి తెలిపారు. ఈ కేసులో తన తరఫున వాదించడానికి ఆ మహిళ న్యాయవాదులను నియమించుకున్నట్లు చెప్పారు. దీంతో కుటుంబపరమైన, చట్టపరమైన అంశాలను పరిశీలిస్తున్నట్లు పోలీస్ అధికారి వివరించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# బిజినెస్

## ఫ్లాట్‌గా కదులుతున్న దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు

**-స్వల్ప హెచ్చుతగ్గులతో కొనసాగుతున్న ట్రేడింగ్**
**-182 పాయింట్లు పుంజుకున్న సెన్సెక్స్**
**-6 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ**




**ముంబై**

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం ఉదయం స్వల్ప హెచ్చుతగ్గులతో ట్రేడవుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాలు, ముడి చమురు ధరల కదలికలు, బాండ్ ఈల్డ్స్ వంటి అంశాల ప్రభావం దేశీయ మార్కెట్లపై కనిపిస్తోంది. దీంతో ఉదయం ట్రేడింగ్‌లో సూచీలు పెద్దగా మార్పు లేకుండా ఫ్లాట్‌గా కొనసాగుతున్నాయి. ఉదయం ట్రేడింగ్‌లో నిఫ్టీ 6 పాయింట్లు నష్టపోయి 22,710 వద్ద కదులుతోంది. మరోవైపు సెన్సెక్స్ 182 పాయింట్లు పుంజుకుని 72,703 వద్ద ట్రేడవుతోంది. దీంతో మార్కెట్‌లో కొనుగోళ్లు, అమ్మకాల మధ్య సమతుల్యత కనిపిస్తోంది.

**అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావం**

అంతర్జాతీయంగా కీలక సూచీల కదలికలు కూడా ఇన్వెస్టర్లను ప్రభావితం చేస్తున్నాయి. అమెరికా డాలర్ ఇండెక్స్ 101.38 వద్ద కొనసాగుతోంది. అలాగే అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర 96.5 దాలర్లకు చేరింది. అమెరికా 10 ఏళ్ల బాండ్ ఈల్డ్స్ 5.23 శాతానికి చేరాయి.

**నష్టాల్లో అమెరికా మార్కెట్లు**

గడిచిన సెషన్‌లో అమెరికా స్టాక్ మార్కెట్లు స్వల్ప నష్టాలతో ముగిశాయి. ఎస్అండ్‌పీ 500 సూచీ 0.17 శాతం, నాస్‌డాక్ 0.09 శాతం నష్టపోయాయి. ఈ పరిణామాల నేపథ్యంలో దేశీయ మార్కెట్లు కూడా బుధవారం ఉదయం అప్రమత్తంగా కదులుతున్నాయి.

## భారీగా పెరిగిన బంగారం ధరలు

**-రెండు రోజులు తగ్గిన పసిడి.. ఒక్కసారిగా పైకి**
**-24 క్యారెట్లపై రూ.770 పెరుగుదల**
**-22 క్యారెట్లపై రూ.700 పెంపు**
**-కిలో వెండి రూ.2.40 లక్షల వద్ద స్థిరం**



హైదరాబాద్: గత రెండు రోజులుగా వరుసగా తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు బుధవారం ఒక్కసారిగా భారీగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్‌లోని పరిణామాలు, దేశీయంగా డిమాండ్ వంటి అంశాల ప్రభావంతో పసిడి ధరలు మళ్లీ పైకి కదిలాయి. దీంతో బంగారం కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులపై అదనపు భారం పడనుంది. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.770 పెరిగింది. దీంతో రూ.1,48,800 నుంచి రూ.1,49,570కు చేరుకుంది. రెండు రోజులుగా ధరలు తగ్గడంతో కొంత ఊరట పొందిన వినియోగదారులకు బుధవారం పెరుగుదలతో మళ్లీ నిరాశ ఎదురైంది.

**22 క్యారెట్ల ధర కూడా పైకి**

ఆభరణాల తయారీలో ఎక్కువగా వినియోగించే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.700 పెరిగింది. దీంతో ఈ ధర రూ.1,37,100కు చేరుకుంది. పసిడి ధరలు భారీ స్థాయిలో కొనసాగుతున్న నేపథ్యంలో ఆభరణాలు కొనుగోలు చేసే వారు ధరలను గమనిస్తూ నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

**వెండి ధరలో మార్పులేదు**

మరోవైపు వెండి ధర మాత్రం బుధవారం స్థిరంగా కొనసాగింది. కిలో వెండి ధర రూ.2,40,000 వద్ద ఎలాంటి మార్పు లేకుండా ఉంది. దీంతో బంగారం ధరలు పెరిగినా వెండి ధరలో మాత్రం వినియోగదారులకు ఊరట లభించింది.

**ప్రాంతాలను బట్టి స్వల్ప మార్పులు**

బంగారం, వెండి ధరలు నగరాలు, మార్కెట్లను బట్టి స్వల్పంగా మారే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా స్థానిక పన్నులు, వ్యాపారుల మార్జిన్లు, తయారీ ఛార్జీలు తదితర కారణాలతో తుది కొనుగోలు ధరలో కొంత తేడా ఉండొచ్చు. ఆభరణాలు కొనుగోలు చేసే సమయంలో బంగారం ధరతో పాటు మేకింగ్ ఛార్జీలు, జీఎస్టీ తదితరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లోనూ ధరల్లో స్వల్ప మార్పులు ఉండే అవకాశం ఉంది.

## భారత్‌లో 'యాపిల్ పే' సేవలు ప్రారంభం

**-యాక్సిస్ బ్యాంక్‌తో కలిసి సేవలు అందుబాటులోకి**
**-ఐఫోన్, ఐప్యాడ్, యాపిల్ వాచ్‌తో చెల్లింపులు**
**-భారత డిజిటల్ పేమెంట్స్ మార్కెట్‌లోకి యాపిల్ ప్రవేశం**



**న్యూఢిల్లీ:**

ప్రముఖ టెక్నాలజీ సంస్థ యాపిల్ భారత్‌లో 'యాపిల్ పే' సేవలను ప్రారంభించింది. యాక్సిస్ బ్యాంక్‌తో కలిసి ఈ సేవలను భారత వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో దేశంలోని డిజిటల్ చెల్లింపుల విభాగంలో యాపిల్ అధికారికంగా అడుగుపెట్టినట్లయింది. యాపిల్ వినియోగదారులు తమ ఐఫోన్, ఐప్యాడ్, యాపిల్ వాచ్ వంటి పరికరాల ద్వారా యాపిల్ పే సేవలను వినియోగించుకోవచ్చని సంస్థ తెలిపింది. ఎంపిక చేసిన యాక్సిస్ బ్యాంక్ కార్డులను యాపిల్ వాలెట్‌లో జోడించి, అనుకూలమైన పాయింట్ ఆఫ్ సేల్ (పీవోఎస్) టెర్మినల్ల వద్ద చెల్లింపులు చేసే సదుపాయం అందుబాటులోకి వచ్చింది.

**వినియోగదారులకు సౌకర్యవంతంగా..**

యాపిల్ పరికరాలను ఉపయోగించే వారికి నగదు లేదా భౌతిక కార్డు అవసరం లేకుండా చెల్లింపులు చేసే అవకాశం కలుగుతుంది. యాపిల్ పేలో కార్డు వివరాలను సురక్షితంగా భద్రపరచుకుని, అనుకూలమైన చోట్ల ట్యాప్ చేసి చెల్లింపులు చేయవచ్చు. దీంతో వేగవంతమైన, సులభమైన చెల్లింపులకు అవకాశం ఉంటుందని సంస్థ పేర్కొంది.

**యాపిల్ ప్రతినిధి వ్యాఖ్య**

భారత వినియోగదారుల కోసం యాపిల్ పేను అందుబాటులోకి తీసుకురావడం ఎంతో సంతోషంగా ఉందని యాపిల్ పే, యాపిల్ వాలెట్ వైస్ ప్రెసిడెంట్ జెన్నిఫర్ బెయిలీ తెలిపారు. భారత మార్కెట్‌లో డిజిటల్ చెల్లింపుల వినియోగం విస్తరిస్తున్న నేపథ్యంలో యాపిల్ పే సేవల ప్రారంభానికి ప్రాధాన్యం ఏర్పడింది.

## బ్రెజిల్‌కు బిగ్ షాక్..

**-భారత పర్యటనకు స్టార్ ఫుట్‌బాలర్ దూరం..!**



ఫిఫా వరల్డ్‌కప్‌లో మెరిసిన బ్రెజిల్ ఫుట్‌బాల్ స్టార్లను చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారత అభిమానులకు బిగ్ షాక్. ఫ్రెండ్లీ మ్యాచ్‌కు కీలక ఆటగాడు దూరమయ్యాడు. అక్టోబర్ 3వ తేదీన సాల్ట్ లేక్ స్టేడియంలో ఇండియాతో ఫ్రెండ్లీ పోరుకు ముందే ఫార్వర్డ్ రఫిన్హ సేవల్ని కోల్పోయింది బ్రెజిల్. ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో మైదానంలో మెరిసిన రఫిన్హ గాయపడ్డాడు. దాంతో.. అతడిని స్క్వాడ్ నుంచి తప్పించామని, టీమిండియా మ్యాచ్‌కు అతడు దూరమయ్యాని బ్రెజిల్ ఫుట్‌బాల్ వెల్లడించింది.స్వదేశంలో భారత్, బ్రెజిల్ ఫ్రెండ్లీ మ్యాచ్‌కు మరో మూడు రోజులే ఉంది. ఇప్పటికే ఇరుజట్లు సన్నాహాల్లో ఉండగా.. మంగళవారం ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో బ్రెజిల్ ఫార్వార్డ్ రిఫన్హ తొడ గాయంతో ఇబ్బంది పడ్డాడు. అతడి కుడి తొడ భాగంలో కండరాల్లో వాపు వచ్చింది. అయితే.. కండరాల్లో చీలిక మాత్రం లేదని వైద్య పరీక్షల్లో తెలిసింది. అయినప్పటికీ ముందు జాగ్రత్తగా అతడిని స్క్వాడ్ నుంచి తప్పించారు. దాంతో, కోల్‌కతాలో అక్టోబర్ 3న మెన్ ఇన్ బ్లూతో మ్యాచ్‌కు రిఫిన్హ అందుబాటులో ఉండడం లేదు. అంతేకాదు ఈ ఫార్వర్డ్ ప్లేయర్ స్థానంలో మరొక ఆటగాడిని బ్రెజిల్ ఫుట్‌బాల్ సమాఖ్య ప్రకటించలేదు.ఫ్రెండ్లీ మ్యాచ్ కోసం అక్టోబర్ 1న భారత్‌కు బ్రెజిల్ బృందం రానుంది. బెంగళూరులో సెప్టెంబర్ 26 పనామా ఆటగాళ్లను సమర్ధంగా నిలువరించిన భారత్ 1-1తో డ్రా చేసుకుంది. అదే ఉత్సాహంతో ప్రపంచంలోనే మేటి మేటి జట్టు, ఐదుసార్లు ఫిఫా వరల్డ్‌కప్ ఛాంపియన్ బ్రెజిల్‌ను నిలువరించేందుకు గుర్‌ప్రీత్ సింగ్ సంధు సారథ్యంలోని టీమిండియా సిద్ధమవుతోంది.

## 4 ఏళ్ల నిరీక్షణకు తెర..

**-మహిళల హాకీ ఫైనల్లో భారత్!**
**-దక్షిణ కొరియాపై 2-0 ఘన విజయం**
**-గోల్స్ చేసిన ఇషికా చౌదరీ, సలీమా టెటె**
**-స్వర్ణం కోసం చైనాతో టైటిల్ పోరు**
**-1982 తర్వాత మరోసారి పసిడి వేటలో టీమిండియా**




**నాగోయా**

ఆసియా క్రీడల్లో భారత మహిళల హాకీ జట్టు అదరగొడుతోంది. లీగ్ దశలో అజేయంగా నిలిచిన టీమిండియా.. బుధవారం జరిగిన సెమీఫైనల్లో దక్షిణ కొరియాను 2-0తో ఓడించి ఫైనల్లోకి దూసుకెళ్లింది. దీంతో ఆసియా క్రీడల మహిళల హాకీలో 44 ఏళ్ల తర్వాత మరోసారి స్వర్ణం సాధించే అవకాశాన్ని భారత్ అందిపుచ్చుకుంది.

**రెండో అర్ధభాగంలో గోల్స్**

మొదటి రెండు క్వార్టర్లలో భారత్ ఆధిపత్యం ప్రదర్శించినప్పటికీ గోల్ మాత్రం చేయలేకపోయింది. దక్షిణ కొరియా రక్షణను సమర్థంగా ఎదుర్కొంటూ భారత్ పదేపదే ప్రత్యర్థి సర్కిల్‌లోకి చొచ్చుకెళ్లింది. అయితే కొరియా డిఫెన్స్, గోల్‌కీపర్ భారత దాడులను అడ్డుకున్నారు. మూడో క్వార్టర్‌లో భారత్‌కు ఎట్టకేలకు గోల్ లభించింది. 44వ నిమిషంలో ఇషికా చౌదరీ గోల్ చేసి టీమిండియాకు 1-0 ఆధిక్యాన్ని అందించింది. అనంతరం చివరి క్వార్టర్‌లో కెప్టెన్ సలీమా టెటె 48వ నిమిషంలో మరో గోల్ సాధించడంతో భారత్ ఆధిక్యం 2-0కు చేరింది. చివరి నిమిషాల్లో కొరియా పుంజుకునేందుకు ప్రయత్నించినా భారత రక్షణ గట్టిగా నిలిచింది.

**1982 తర్వాత మళ్లీ..**

ఆసియా క్రీడల్లో భారత మహిళల హాకీ జట్టు చివరిసారిగా 1982లో ఢిల్లీలో స్వర్ణ పతకం సాధించింది. ఆ తర్వాత పసిడి కోసం సాగిన నిరీక్షణ కొనసాగుతూనే ఉంది. ఇప్పుడు సలీమా టెటె నాయకత్వంలోని జట్టు ఫైనల్‌కు చేరడంతో ఆ నిరీక్షణకు తెరదించే అవకాశం భారత్‌కు లభించింది.

**చైనాతో స్వర్ణ పోరు**

దక్షిణ కొరియాపై విజయం సాధించిన భారత్ ఇప్పుడు డిఫెండింగ్ ఛాంపియన్ చైనాతో ఫైనల్లో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తే 1982 తర్వాత ఆసియా క్రీడల మహిళల హాకీలో భారత్ మరోసారి స్వర్ణ పతకం సాధిస్తుంది. ఫైనల్‌లో చైనాను ఎదుర్కొనేందుకు భారత జట్టు సిద్ధమవుతోంది.

# స్పోర్ట్స్

## ఐపీఎల్ టు ఐఎల్‌టీ20..

**-ఎంఐ ఎమిరేట్స్ హెడ్‌కోచ్‌గా బౌచర్!**
**-ముంబై ఇండియన్స్ మాజీ కోచ్‌కు మరో కీలక బాధ్యత**
**-రాబిన్ సింగ్ స్థానంలో బాధ్యతలు**
**-2023, 2024లో ఐపీఎల్‌లో ముంబైకి కోచ్‌గా సేవలు**
**-ఎంఐ ఎమిరేట్స్‌ను మరోసారి టైటిల్ బాట పట్టించేందుకు సిద్ధం**

**ముంబై**



దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్, కోచ్ మార్క్ బౌచర్ మరోసారి ముంబై ఫ్రాంచైజీతో కలిసి పనిచేయనున్నాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ముంబై ఇండియన్స్‌కు గతంలో హెడ్‌కోచ్‌గా వ్యవహరించిన బౌచర్.. ఇప్పుడు ఇంటర్నేషనల్ టీ20 లీగ్ (ఐఎల్‌టీ20)లో ఎంఐ ఎమిరేట్స్ హెడ్‌కోచ్‌గా నియమితుడయ్యాడు. వచ్చే సీజన్ నుంచి జట్టుకు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నాడు.

**రాబిన్ సింగ్ స్థానంలో..**

ఎంఐ ఎమిరేట్స్‌కు ఇప్పటివరకు కోచ్‌గా వ్యవహరించిన రాబిన్ సింగ్ స్థానాన్ని బౌచర్ భర్తీ చేయనున్నాడు. సుదీర్ఘ క్రికెట్ అనుభవంతో పాటు కోచింగ్‌లోనూ అనుభవం ఉన్న బౌచర్‌ను జట్టు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ముంబై యాజమాన్యం బుధవారం ప్రకటించింది. ముంబై ఫ్రాంచైజీకి చెందిన మరో జట్టుకు బౌచర్ సేవలు అందించనుండటంతో ఈ నియామకంపై ఆసక్తి నెలకొంది.

**ఐఎల్‌టీ20లో ఎంఐ ఎమిరేట్స్ ప్రస్థానం**

రాబిన్ సింగ్ కోచ్‌గా ఉన్న సమయంలో ఎంఐ ఎమిరేట్స్ 2024లో తొలిసారి ఐఎల్‌టీ20 ఛాంపియన్‌గా నిలిచింది. ఆ తర్వాత 2025-26 సీజన్‌లోనూ జట్టు ఫైనల్‌కు చేరుకుంది. అయితే తుది పోరులో డెజర్ట్ వైపర్స్ చేతిలో ఓటమిపాలై రెండోసారి టైటిల్ సాధించే అవకాశాన్ని కోల్పోయింది. ఈ నేపథ్యంలో జట్టును మరోసారి టైటిల్ బాట పట్టించే బాధ్యతను బౌచర్‌కు అప్పగించారు.

**ముంబై ఇండియన్స్‌తో గతంలో..**

బౌచర్ గతంలో 2023, 2024 సీజన్లలో ముంబై ఇండియన్స్ హెడ్‌కోచ్‌గా పనిచేశాడు. ఆ సమయంలో జట్టు ప్రదర్శనపై పలు విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా రోహిత్ శర్మ స్థానంలో హార్దిక్ పాండ్యాను కెప్టెన్‌గా నియమించడం ముంబై శిబిరంలో చర్చనీయాంశంగా మారింది. భవిష్యత్ ప్రణాళికల్లో భాగంగానే ఈ మార్పు చేసినట్లు ఫ్రాంచైజీ అప్పట్లో పేర్కొంది.

ఇప్పుడు ఐఎల్‌టీ20లో ఎంఐ ఎమిరేట్స్ బాధ్యతలు చేపట్టనున్న బౌచర్.. తన అనుభవంతో జట్టుకు కొత్త వ్యూహాలను రూపొందించనున్నాడు. వచ్చే సీజన్‌లో ఎంఐ ఎమిరేట్స్ ప్రదర్శన ఎలా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారింది.

# ఆసక్తికరంగా 'ప్రహార్' ట్రైలర్!

## ముంబై టెరర్ అటాక్స్ నేపథ్యంలో రాజ్ కుమార్ రావు కొత్త సినిమా..




బాలీవుడ్ ప్రముఖ నటుడు రాజ్ కుమార్ రావు ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ప్రహార్: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ఉజ్వల్ నికమ్' . దేశాన్ని షాక్‌కి గురిచేసిన ముంబై ఉగ్రరూప దాడుల నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ట్రైలర్ తాజాగా విడుదలైంది. దేశం గర్వించదగ్గ ప్రముఖ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉజ్వల్ నికమ్ జీవిత చరిత్ర ఆధారంగా ఈ చిత్రం రూపొందుతోంది. ముఖ్యంగా 26/11 ముంబై ఉగ్రదాడి సమయంలో అజ్మల్ కసబ్ కేసుకు సంబంధించి ఆయన చేపట్టిన సాహసోపేతమైన వాదనలు, కోర్టు రూమ్ డ్రామా మరియు ఆయన వ్యక్తిగత జీవితంలోని ముఖ్య ఘట్టాలను ఈ చిత్రంలో చూపించనున్నారు. ఈ బయోపిక్‌లో ఉజ్వల్ నికమ్ పాత్రలో టాలెంటెడ్ యాక్టర్ రాజ్ కుమార్ రావు తన నటనతో మెప్పించనున్నారు. ఆయన సరసన వామికా గబ్బి ప్రధాన పాత్రలో నటిస్తుండగా, జైదీప్ అహ్లావత్, సికందర్ ఖేర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అవినాష్ అరుణ్ ధవారే ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా.. ప్రముఖ నిర్మాణ సంస్థ మ్యాడాక్ ఫిల్మ్స్ (మీుసశీషుస ఖీఱశ్రీఎం) పతాకంపై దినేష్ విజన్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 16, 2026 న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

# ఒకేసారి మూడు ఓటీటీల్లోకి 'అమీర్ లోగ్'..

## - స్ట్రీమింగ్ ఎక్కడంటే?



టాలీవుడ్‌లో సరికొత్త ప్రయోగాలతో వస్తున్న చిన్న చిత్రాలు ఓటీటీ ప్రేక్షకులను ఎంతగానో అలరిస్తున్నాయి. పెద్దగా అంచనాలు లేకుండా, పూర్తిగా నూతన నటీనటులతో తెరకెక్కిన విభిన్నమైన కామెడీ డ్రామా సినిమా 'అమీర్ లోగ్'. రమణా రెడ్డి సోమ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం గత నెల 21వ తేదీన థియేటర్లలోకి వచ్చి నిశ్శబ్దంగా ప్రేక్షకులను పలకరించింది. అయితే ఆ సమయంలో సరైన ప్రమోషన్స్ లేకపోవడం, అదే సమయంలో రవితేజ 'ఇరుముడి' సినిమా ప్రభావం గట్టిగా ఉండటంతో ఈ చిత్రం థియేట్రికల్ రన్‌లో పెద్దగా బజ్ సృష్టించలేకపోయింది. చాలామంది ప్రేక్షకులకు ఈ సినిమా థియేటర్లలో రిలీజైన సంగతి కూడా తెలియదు. అయితే, ఈ చిన్న సినిమా ఇప్పుడు ఏకకాలంగా మూడు ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లలోకి అడుగుపెట్టి రికార్డు సృష్టించింది. ప్రస్తుతం ఈ చిత్రం 'ఆహా', 'అమెజాన్ ప్రైమ్ వీడియో', 'సన్ నెక్స్ట్' ఓటీటీలలో స్ట్రీమింగ్‌కు అందుబాటులో ఉంది.కథ విషయానికి వస్తే.. హైదరాబాద్‌లోని ఓ అందమైన బస్తీ నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. జీవితంపై ఎలాంటి పెద్ద లక్ష్యాలు లేకుండా, జులాయిగా తిరిగే ముగ్గురు ప్రాణ స్నేహితులు శ్రీను (వీజ హరి), ఫరూక్ (మనోజ్), మల్లేశ్ (శశిధర్) కథే ఈ చిత్రానికి ప్రధాన కేంద్రం. ఏ పనీ చేయకుండా తిరుగుతూ, తాగుతూ కాలం వెళ్లదీస్తున్న వీరికి, అదే బస్తీకి చెందిన నజీర్ (సాయియోగి)తో క్రికెట్ విషయంలో తీవ్రమైన గొడవ జరుగుతుంది. ఈ ముగ్గురి దయనీయ పరిస్థితిని చూసిన బస్తీ అమ్మాయి గీత (వేద జలంధర్).. వీళ్లను తమ్ముళ్లుగా భావించి సరైన దారిలో నడవాలని, జీవితంలో స్థిరపడాలని హితబోధ చేస్తుంది. ఆమె సహాయంతో శ్రీను చివరకు ఒక ఆఫీస్‌లో ఆఫీస్ బాయ్‌గా చిన్న ఉద్యోగంలో చేరుతాడు. అయితే, తన ఆఫీస్ కొలీగ్స్‌తో సరదాగా క్రికెట్ ఆడిన శ్రీను.. అనుకోకుండా ఒక పంతానికి పోయి, "మా బస్తీ వాళ్లు మీకంటే చాలా బాగా ఆడతారు" అంటూ సవాలు విసిరి భారీ బెట్ కడతాడు. ఆ ప్రతిష్టాత్మక మ్యాచ్‌లో బస్తీ టీమ్ విజయం సాధించిందా లేదా? ఆ యువకుల జీవితాలను చక్కదిద్దడంలో బస్తీలోని పెద్దాయన చాచా (విశ్వేందర్) పాత్ర ఎలాంటిది? ఈ కథలోకి ఊహించని విధంగా 'బిర్యానీ' కాన్సెప్ట్ ఎలా ప్రవేశించింది? గీత ప్రియుడు రవి (రావణ్) ఎంట్రీ వల్ల ఆ ముగ్గురు స్నేహితుల జీవితాల్లో ఎలాంటి ఊహించని మలుపులు వచ్చాయి? అనే ఆసక్తికరమైన అంశాలతో ఈ సినిమా సాగుతుంది. హైదరాబాద్ నగర వాతావరణం, బస్తీ నేపథ్యంలో సాగే సహజమైన సంభాషణలు, ఫ్రెండ్స్ మధ్య ఉండే సరదా గొడవలతో ఈ సినిమా యూత్‌కు బాగా కనెక్ట్ అవుతుంది. వీకెండ్‌లో సరదాగా టైమ్ పాస్ చేయాలనుకునేవారికి ఈ కామెడీ డ్రామా ఒక మంచి ఛాయిస్ అని చెప్పవచ్చు.



దివ్య భారతి అందాలకు కుర్రాళ్లు ఫిదా.



# రజనీకాంత్ 'ధర్మన్'లో శ్రీలీల..

## -రామ్ పోతినేనితో మరోసారి జోడీ కడుతుందా?

సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'ధర్మన్' సినిమాకు సంబంధించి రోజుకో ఆసక్తికరమైన విషయం బయటకు వస్తోంది. ఇప్పటికే ఈ సినిమాలో రామ్ పోతినేని నటిస్తున్నారనే విషయం హీరోయిన్ రాశీ ఖన్నా అనుకోకుండా వెల్లడించిన సంగతి తెలిసిందే. తాజాగా మరో కీలక అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. ఈ చిత్రంలో శ్రీలీల కూడా భాగమైనట్లు తాజా వీడియోతో స్పష్టమైంది. 'ధర్మన్' సినిమా షూటింగ్ జరుగుతున్న ప్రాంతం నుంచి తాజాగా ఓ వీడియో సోషల్ మీడియాలో ప్రత్యక్షమైంది. ఇందులో శ్రీలీల సంప్రదాయ దుస్తుల్లో కనిపించారు. దీంతో ఈ సినిమాలో ఆమె నటిస్తున్నారనే విషయం దాదాపు ఖరారైంది. ఇప్పటివరకు చిత్రబృందం శ్రీలీల పాత్రకు సంబంధించి ఎలాంటి అధికారిక వివరాలను వెల్లడించలేదు.ఆమె సినిమాలో ఎలాంటి పాత్రలో కనిపించనున్నారు? రజనీకాంత్ పాత్రతో ఆమెకు ఎలాంటి సంబంధం ఉంటుంది? కథలో ఆమె పాత్రకు ఎంత ప్రాధాన్యత ఉంటుంది? అనే విషయాలు మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్‌లోనే ఉన్నాయి. శ్రీలీల 'ధర్మన్'లో నటిస్తున్నారనే వార్త బయటకు రావడంతో మరో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. ఈ సినిమాలో రామ్ పోతినేని కూడా కీలక పాత్రలో నటిస్తున్న నేపథ్యంలో.. శ్రీలీల ఆయనకు జోడీగా కనిపించబోతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే రామ్ పోతినేని, శ్రీలీల కలిసి 'స్కంద' సినిమాలో నటించారు. ఆ సినిమాలో వీరిద్దరి కెమిస్ట్రీకి మంచి గుర్తింపు వచ్చింది. దీంతో 'ధర్మన్'లో కూడా వీరిద్దరూ జంటగా కనిపిస్తే మరోసారి అభిమానులకు ఆసక్తికరమైన కాంబినేషన్ అవుతుందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే శ్రీలీల, రామ్ పోతినేని జోడీగా నటిస్తున్నారనే విషయంపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాలేదు. కాబట్టి ప్రస్తుతం ఇది కేవలం ప్రచారంలో ఉన్న వార్తగానే చూడాల్సి ఉంటుంది. మరోవైపు 'ధర్మన్' సినిమా నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. తాజాగా చిత్రబృందం మూడో షెడ్యూల్ షూటింగ్‌ను పూర్తి చేసినట్లు ప్రకటించింది. దీంతో సినిమా నిర్మాణంలో మరో కీలక దశ పూర్తయింది. షూటింగ్ దశల వారీగా ముందుకు సాగుతున్న నేపథ్యంలో త్వరలోనే సినిమా నుంచి మరిన్ని కీలక అప్‌డేట్స్ వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా రామ్ పోతినేని, శ్రీలీల పాత్రలపై చిత్రబృందం ఎప్పుడు అధికారికంగా స్పందిస్తుందనేది ఆసక్తిగా మారింది.అశ్వత్ మారిముత్తు రచన, దర్శకత్వంలో 'ధర్మన్' తెరకెక్కుతోంది. కమల్ హాసన్‌కు చెందిన రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ సంస్థ.. టర్మరిక్ మీడియాతో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.



# అది జీవితకాల పరీక్ష

సినిమాల్లో పాత్రలు మారినట్లే భాష, యాసలు కూడా మారుతుంటాయని, వాటిలో ప్రావీణ్యం సంపాదించడం నటిగా అతి పెద్ద సవాల్ అని చెప్పింది అగ్ర కథానాయిక రాశీఖన్నా. ప్రస్తుతం ఈ భామ దక్షిణాదితో పాటు హిందీలో పలు భారీ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉంది. ఈ సందర్భంగా సోషల్‌మీడియా వేదికగా అభిమానులతో ముచ్చటించిన ఆమె పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. భాషతో పాటు యాసల్ని నేర్చుకోవడం సాధారణ విషయం కాదని, అదొక జీవితకాల పరీక్షలా అనిపిస్తుందని రాశీఖన్నా చెప్పుకొచ్చింది.'కొత్త భాషను, యాసను అర్థం చేసుకోవడం నిరంతర అభ్యాసంలా ఉంటుంది. ఒకటి పూర్తికాగానే మరొకటి నేర్చుకోవాలి. వివిధ భాషా చిత్రాల్లో పనిచేస్తూ..నటిగా ప్రతిభను చాటుకోవాలంటే భాషలపై పట్టు సంపాదించడం చాలా ముఖ్యం. ఈ పరీక్షలకు గ్రాడ్యుయేషన్ డే అంటూ ఉండదు' అని రాశీఖన్నా పేర్కొన్నది. ప్రస్తుతం ఈ భామ రజనీకాంత్ 'ధర్మన్'తో పాటు హిందీలో 'ఫర్జీ' సిరీస్ రెండో భాగంలో నటిస్తున్నది. అక్షయ్‌కుమార్ హీరోగా నటిస్తున్న ఓ చిత్రంలో కీలక పాత్రలో కనిపించనుంది.